గురువారం
THURSDAY
19-11-2026

సంపుటి (Volume):2 ॥ సంచిక: (Issue): 140

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక



ఫ్యాన్సీకి నంబర్ గడువు 30 రోజులే



హైదరాబాద్, నవంబర్ 19 (ఈవార్తలు): కొత్త వాహనాలకు ఫ్యాన్సీ నంబరు పొందే గడువును తెలంగాణ రవాణా శాఖ 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించింది. ఈ మార్పు నవంబర్ 19 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. తాత్కాలిక రిజిస్ట్రేషన్ జారీ అయిన తేదీ నుంచి 30 రోజుల్లోగా ఫ్యాన్సీ నంబరు రిజర్వేషన్, బిడ్డింగ్, చెల్లింపులు పూర్తి చేయాలి. గడువులోగా ప్రక్రియ పూర్తికాకపోతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా ర్యాండమ్ నంబరు కేటాయిస్తుందని రవాణా శాఖ తెలిపింది. వాహనం విక్రయించే సమయంలోనే ఈ మార్పును కొనుగోలుదారులకు తెలియజేయాలని డీలర్లకు సూచించింది.

యూట్యూబర్లు జర్నలిస్టులు కారు

సుప్రీంకోర్టులో ఢిల్లీ పోలీసుల అఫిడవిట్



న్యూఢిల్లీ: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్ మేకర్లను వృత్తిపరంగా వార్తలు కవర్ చేసే జర్నలిస్టులతో సమానంగా పరిగణించలేమని ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేసిన జర్నలిస్టులపై పోలీసులు దాడులు, వేధింపులకు పాల్పడ్డారంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. వాటికి సమాధానంగా పోలీసులు అఫిడవిట్ సమర్పించారు. కెమెరా, మైక్‌తో వీడియోలు తీస్తున్నంత మాత్రాన వృత్తిపరమైన జర్నలిస్టుగా పరిగణించలేమని వాదించారు. అక్రెడిటేషన్ లేకపోయినా మీడియా ప్రతినిధులకు కవరేజ్‌కు అవకాశం ఇచ్చామని, శాంతిభద్రతల కోసమే నిరసన ప్రాంతంలో ఆంక్షలు పెట్టామని పేర్కొన్నారు.

బర్డ్‌ఫ్లూకు స్వదేశీ టీకా



భోపాల్: కోళ్లలో బర్డ్‌ఫ్లూ నివారణకు దేశీయంగా రూపొందించిన తొలి హెచ్5ఎన్1 టీకాను కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ నెల 20న భోపాల్‌లో విడుదల చేయనున్నారు. భోపాల్‌లోని ఐసీఏఆర్-నిహ్సాడ్ శాస్త్రవేత్తలు ఈ టీకాను అభివృద్ధి చేశారు. భారత్‌లో 2006లో బర్డ్‌ఫ్లూ తొలిసారి వెలుగుచూసినప్పటి నుంచి హెచ్5ఎన్1, హెచ్5ఎన్8 రకాలకు సంబంధించి 500కు పైగా వ్యాప్తి ఘటనలు నమోదయ్యాయి. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు కోళ్లను పెద్ద సంఖ్యలో చంపాల్సి రావడంతో పౌల్ట్రీ రైతులు నష్టపోతున్నారు. ఈ టీకాతో ఆ నష్టాలను తగ్గించే అవకాశం ఉంది.

రాజన్నకు దారెటు?

దర్గా వైపు నుంచి సర్వదర్శనం క్యూలైన్?.. దర్గా ముందుగా ఆలయానికి భక్తుల రాక?



అంజన్న ఒంటిపై 100 కిలోల చందనం

60 ఏళ్లుగా పెరుగుతూ వచ్చిన చందనం తొలగింపు

మల్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): ఆరు దశాబ్దాలుగా కొండగట్టు ఆంజనేయస్వామి మూలవిరాట్‌పై పేరుకుపోయిన చందనాన్ని శాస్త్రోక్తంగా తొలగించారు. చందనోత్సవ కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి మూలవిరాట్‌కు అలంకరించిన చందనాన్ని ప్రత్యేక విధానంలో తొలగించగా, ఈ సందర్భంగా తొలగించిన చందనాన్ని బుధవారం చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ఆధ్వర్యంలో తూకం వేయగా.. 99 కిలోల 720 గ్రాములుగా నమోదైంది. తరువాయి 2 వ పేజీలో...

శిఖరం తొలగింపుపై చర్చ నడుస్తుండగానే కొత్త సందేహం

ప్రవేశ మార్గం, క్యూలైన్ ప్లాన్‌పై స్పష్టత రావాల్సిందే

13 ఏళ్లుగా ట్రస్ట్ బోర్డు కోసం ఎదురుచూపు

చైర్మన్ నియామకంలో జాప్యంపై భక్తుల ప్రశ్నలు



పునర్నిర్మాణం తర్వాత వేములవాడ రాజన్న దర్శనానికి భక్తులు ఎటువైపు నుంచి ఆలయంలోకి వెళ్లాలి? సర్వదర్శనం క్యూలైన్ ఎక్కడ మొదలవుతుంది? కొత్తగా నిర్మించిన దర్గా ముందుగా భక్తులు గుడికి చేరుకోవాల్సి వస్తుందా? రాజన్న ఆలయ పనులపై చర్చలో ఇప్పుడు ఈ ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. దర్గా నిర్మాణం పూర్తవడం, ఆలయ శిఖరం తొలగింపుపై చర్చ కొనసాగుతుండటంతో సర్వదర్శనం ప్రవేశ మార్గంపైనా ఆసక్తి పెరిగింది. దర్గా వైపు నుంచి క్యూలైన్ ప్రారంభమవుతుందనే ప్రచారానికి అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

(ఈవార్తలు - గ్రౌండ్ రిపోర్ట్)

ఆలయ పునర్నిర్మాణంలో గుడికి వెళ్లే దారి ఎటు నుంచి ఉంటుందన్నది భక్తులకు నేరుగా సంబంధించిన విషయం. సర్వదర్శనానికి వచ్చే వారు క్యూలో ఎక్కడ చేరాలి? అక్కడి నుంచి ఏ దారిలో ఆలయంలోకి వెళ్లాలి? దర్శనం పూర్తయ్యాక ఎటువైపు నుంచి బయటకు రావాలి? ఈ వివరాలు తెలిస్తేనే భక్తులకు కొత్త ఏర్పాట్లపై అవగాహన వస్తుంది. ప్రస్తుతం చర్చంతా కొత్త దర్గా వైపు నుంచి క్యూలైన్ మొదలవుతుందా, అది దర్గా ముందుగా సాగుతుందా అన్న ప్రశ్నల చుట్టూ తిరుగుతోంది. 'దర్గా వైపు నుంచి క్యూలైన్' అనే మాటతోనే భక్తులు దర్గా ముందు నుంచే వెళ్లాల్సి వస్తుందనే నిర్ధారణకు రాలేం. క్యూలైన్ మొదలయ్యే చోటు, అక్కడి నుంచి గుడికి వెళ్లే దారి తెలిస్తేనే దీనిపై స్పష్టత వస్తుంది. ఒకవేళ దర్గా ముందుగా క్యూలైన్ సాగితే, ఆ మార్గం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ఉంటుంది? సర్వదర్శనానికి అదే ప్రధాన ప్రవేశమా? మరో ప్రవేశం ఉంటుందా? అన్న ప్రశ్నలకూ సమాధానం అవసరం. దర్గా దర్శనం తప్పనిసరి చేస్తారనే వాదనకు ప్రస్తుతం ఆధారం లేదు. ఆలయ శిఖరాన్ని తొలగించడంతో పునర్నిర్మాణ పనులపై ఇప్పటికే చర్చ నడుస్తోంది. ఆ చర్చ కొనసాగుతుండగానే సర్వదర్శనం క్యూలైన్ ఎటు నుంచి మొదలవుతుందన్న సందేహం ముందుకొచ్చింది. దర్గా నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో దాని పక్కన ఉన్న దారిని సర్వదర్శనానికి ఉపయోగిస్తారా అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఆలయ శిఖరానికి సంబంధించిన పనుల వివరాలతో పాటు భక్తుల తరువాయి 2 వ పేజీలో...



ఓటరు జాబితా వాయిదా

డిసెంబర్ 22న తుది జాబితా విడుదల

అభ్యంతరాల కోసం డిసెంబర్ 15 వరకు గడువు

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చింది. నవంబర్ 30న విడుదల కావాల్సిన తుది జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నట్లు తెలిపింది. నోటీసుల జారీ, దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారానికి గడువును నవంబర్ 26 నుంచి డిసెంబర్ 15 వరకు పొడిగించింది. గణన సమయంలో అందుబాటులో లేనివారు, చిరునామా మారినవారు, మరణించినవారు, ఒకటికంటే ఎక్కువసార్లు నమోదైనవారిగా గుర్తించిన ఎంట్రీలకు సంబంధించి నవంబర్ 30 వరకు ఫారాల పంపిణీ, సేకరణ చేపట్టనున్నారు. వాటి పరిశీలనను డిసెంబర్ 10 నాటికి పూర్తి చేయనున్నారు. మారిన షెడ్యూల్‌ను ప్రజలకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు తెలియజేయాలని ఈసీ ఆదేశించింది.

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,604
వెండి (కిలో):	రూ.1,90,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,426

భారత్‌లో ఆర్థిక విపత్తు

నిరుద్యోగం తీవ్రం.. తయారీ రంగం దెబ్బతింది

సేవల రంగంతోనే అందరికీ ఉద్యోగాలు ఇవ్వలేం

కొలంబియా యూనివర్సిటీలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

విదేశాల్లో భారత్‌ను అవమానిస్తున్నారన్న బీజేపీ



న్యూయార్క్, నవంబర్ 18 (ఈవార్తలు): నిరుద్యోగం పెరగడం, తయారీ రంగం దెబ్బతినడంతో భారత ఆర్థిక వ్యవస్థ విపత్తు అంచున ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతూ, దేశ ఆర్థిక నమూనా దాదాపు పదేళ్ల క్రితమే ఫలితాలు ఇవ్వడం ఆగిపోయిందని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఉపాధి కల్పనలో కీలకమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యవసాయం దెబ్బతిన్నాయని రాహుల్ అన్నారు. సేవల రంగంతోనే అందరికీ ఉద్యోగాలు కల్పించలేమని, తయారీ రంగాన్ని మళ్లీ నిలబెట్టాలని చెప్పారు. ప్రైవేటు పెట్టుబడులు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అదానీ, అంబానీ వంటి కొద్దిమంది బడా పారిశ్రామికవేత్తలే ఎదుగుతున్నారని ఆరోపించారు. 'మేక్ తరువాయి 2 వ పేజీలో...

నిలకడగా భారత ఆర్థికం

2026-30 అంచనాల్లో 71 స్కోరుతో తొలి స్థానం

చైనాకు 66, అమెరికాకు 36 స్కోరు.. వాస్తవ జీడీపీ వృద్ధి, స్థూల పాదుపులోనూ అగ్రస్థానం

అంతర్జాతీయ ఆర్థిక సవాళ్లను తట్టుకునే సామర్థ్యంలో ప్రధాన ఆర్థిక వ్యవస్థల జాబితాలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. అసోచామ్, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) గణాంకాలను ఉటంకిస్తూ 'ఇన్ఫోఇన్‌డేటా' ఎక్స్‌లో వెల్లడించిన 2026-30 అంచనాల ప్రకారం భారత్‌కు 100కు 71 స్కోరు వచ్చింది. చైనా 66 స్కోరుతో రెండో స్థానంలో నిలవగా, జపాన్, రష్యా 60 స్కోరుతో మూడో స్థానాన్ని పంచుకున్నాయి.



ఈవార్తలు, బిజినెస్ డెస్క్: అమెరికాకు 36 స్కోరు వచ్చింది. ఈ పోలికలో వాస్తవ జీడీపీ వృద్ధి, తలసరి జీడీపీ వృద్ధి, స్థూల పొదుపులో భారత్ మొదటి స్థానంలో నిలిచింది. స్థూల మూలధన ఏర్పాటులో, ఎగుమతుల వృద్ధిలో రెండో స్థానం దక్కించుకుంది. జీడీపీలో రుణాల నిష్పత్తి ఆధారంగా ఇచ్చిన ర్యాంకులో మూడో స్థానం పొందింది. దేశీయ డిమాండ్, ఎగుమతుల వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచాయని ఆర్‌బీఐ అక్టోబరులో పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో వస్తు ఎగుమతులు రెండంకెల వృద్ధి నమోదు చేయడంతో వాణిజ్య లోటు తగ్గిందని తెలిపింది. మరోవైపు, భారత వృద్ధి అంచనాను ఐఎంఎఫ్ 0.6 శాతం పాయింట్లు పెంచి 7 శాతానికి సవరించింది.

విశ్వవాణి



అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రయోగించిన వాయేజర్-1 వ్యోమనౌక మరో అరుదైన మైలురాయిని చేరుకుంది. 1977లో భూమి నుంచి బయలుదేరిన ఈ వ్యోమనౌక దాదాపు ఐదు దశాబ్దాల ప్రయాణం తర్వాత భూమికి ఒక కాంతి దినం దూరానికి చేరుకుంది. నవంబర్ 18, 2026 నాటికి భూమి నుంచి సుమారు 2,590 కోట్ల కిలోమీటర్ల దూరంలోకి వెళ్లినట్లు పేర్కొంటున్నారు. మానవుడు తయారు చేసిన ఏ వస్తువూ ఇప్పటివరకు ఇంత దూరం ప్రయాణించలేదు.

కొడంగలే తెలంగాణ కాదు

మూడేళ్ల పాలనతో ప్రజలు సంతోషంగా లేరు

పదవులు మీరే ఉంచుకోండి.. మునుగోడుకు నిధులివ్వండి

సొంత ప్రభుత్వంపై రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు



'తెలంగాణ అంటే ఒక్క కొడంగలే కాదు. మంచిగ పాలించండి.. పదవుల్లో మీరే ఉండండి. మా మునుగోడు అభివృద్ధికి నిధులివ్వండి' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మూడేళ్ల పాలన తర్వాత కూడా ప్రజలు సంతోషంగా లేరని సొంత ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

మునుగోడు, నవంబర్ 18 (ఈవార్తలు): మునుగోడు నియోజకవర్గంలో బుధవారం పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడం, మునుగోడును అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తాగునీరు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల కోసం పోరాడతానని చెప్పారు. 'పదవుల కోసం ఎవరి ఇంటి చుట్టూ తిరిగే అలవాటు నాకు లేదు. అధిష్ఠానం ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడు ఆలోచిస్తా' అని తరువాయి 2 వ పేజీలో...



ఓయూలో ఖాకీల జులుం!

100 మంది పోలీసులను తీసుకొచ్చి అరెస్ట్ చేస్తా

భోజనం బాగోలేదని నిరసనకు దిగిన విద్యార్థినులకు ఏసీపీ వార్నింగ్

పోలీసుల తీరును ఖండించిన వీజేఎస్ నేత రమేశ్ యాదవ్

లేడీస్ హాస్టల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టాలని రోడ్డెక్కిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థినులపై ఏసీపీ విరుచుకుపడ్డారు. కేసులు పెడతానంటూ హెచ్చరికలు పంపారు. '100 మంది పోలీసులను తీసుకొచ్చి అరెస్ట్ చేసి మీ మీద కేసులు పెడతా', 'మజాక్ చేయకు, ఎక్కువ మాట్లాడకు కేసులు పెడతా' అని అంటూ విద్యార్థినులపై వీరంగం ప్రదర్శించారు. భోజనంపై

రాశి ఫలాలు

19.11.2026

మేషం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో వృత్తి ఉద్యోగాలలో ప్రోత్సాహకర ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. కొన్ని పనులలో బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు తొలగుతాయి.

వృషభం: ఆర్థిక అనుకూలత కలుగుతుంది. ఉద్యోగమున అంచనాలు నిజమవుతాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సన్నిహితుల నుండి ఊహించని శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. కీలక వ్యవహారాలలో సొంత ఆలోచనలు కలసివస్తాయి.

మిథునం: వ్యాపారమున స్వల్ప లాభాలు అందుతాయి. ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది. సంతాన అనారోగ్య విషయంలో సమస్యలుంటాయి. ఇతరులపై మీ అభిప్రాయం మార్చుకోవడం మంచిది. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు.

కర్కాటకం: చిన్ననాటి మిత్రుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది. సమాజంలో ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి.

సింహం: దాయదులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు లాభసాటిగా ఉంటాయి. వృత్తి వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమిస్తారు. సోదరులతో సఖ్యతగా వ్యవహరిస్తారు.

కన్య: ఖర్చుకు తగినంత ఆదాయం ఉండదు. దీర్ఘకాలిక ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఉద్యోగులకు అదనపు పనిభారం తప్పదు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి.

తుల: ధన వ్యవహారాలు ఉత్సాహాన్నిస్తాయి. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు కలసివస్తాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఉద్యోగాలలో వివాదాలు రాజీ చేసుకుంటారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. దైవ సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు.

వృశ్చికం: కుటుంబ సభ్యులుతో మాటపట్టింపులుంటాయి. చేపట్టిన పనులు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. నిరుద్యోగ ప్రయత్నాలు మందకోడిగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. అవసరానికి ధనం చేతిలో నిల్వ ఉండదు.

ధనస్సు: స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలకు ఆటంకాలు తొలగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. ఆర్థిక పరంగా మరింత పురోగతి కలుగుతుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

మకరం: ఉద్యోగాలలో పనితీరుకు తగిన ప్రశంసలు అందుకుంటారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి.

కుంభం: ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. మీ ప్రవర్తన వలన ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంది. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కలసిరావు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

మీనం: దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరులకు ధన పరంగా మాట ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. బంధు మిత్రులతో మనస్పర్థలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సమస్యలు ఉంటాయి. ధనపరమైన ఇబ్బందులు చికాకు పరుస్తాయి.

రాజన్నకు దారెటు?

మొదటి పేజీ తరువాయి

ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. క్యూలైన్ మొదలయ్యే చోటు, ఆలయ ప్రవేశ ద్వారం, దర్శనం తర్వాత బయటకు వెళ్లే దారి, దర్గా ఉన్న ప్రదేశం ఒకే మ్యాప్‌లో చూపిస్తే కొత్త ఏర్పాట్లు భక్తులకు సులువుగా అర్థమవుతాయి. నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఒక దారి, పనులు పూర్తయ్యాక మరో దారి ఉంటే ఆ వివరాలూ వెల్లడించాలి. ఇప్పుడు భక్తులకు కావాల్సిన ప్రధాన సమాధానం ఒక్కటే. పునర్నిర్మాణం పూర్తయ్యాక రాజన్న సర్వదర్శనానికి ఎటు నుంచి వెళ్లాలి?

13 ఏళ్లుగా లేని పాలక మండలి

ఈ దశలోనే రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి 13 ఏళ్లుగా పాలకమండలి లేదన్న అంశం మళ్లీ చర్చకు వచ్చింది. ఏటా కోట్ల రూపాయల ఆదాయం వచ్చే ఈ ఆలయానికి చైర్మన్, సభ్యుల నియామకం ఎందుకు జరగడం లేదని భక్తులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విస్తరణ పనులకు పర్యవేక్షణ ఉన్నా, ఆలయ నిర్వహణపై భక్తుల అభిప్రాయాలను చర్చించే వేదిక ఏదన్నది వారి ప్రశ్న. రాష్ట్రంలోని పలు ఆలయాలకు పాలకమండళ్లను నియమిస్తున్న ప్రభుత్వం వేములవాడ విషయంలో ఇంతకాలం ఎందుకు నిర్ణయం తీసుకోలేదని స్థానికులు నిలదీస్తున్నారు. నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయా? దేవాదాయ శాఖ నుంచి ప్రభుత్వానికి వెళ్లాయా? ప్రతిపాదనలు ఉంటే ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి? ఏదైనా పరిపాలనాపరమైన అడ్డంకి ఉంటే అదేమిటి? ఇన్నేళ్ల జాప్యానికి కారణం చెప్పడంతో పాటు నియామకం ఎప్పటిలోగా చేపడతారో వెల్లడించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆలయ చైర్మనా?

ముఖ్యమంత్రి ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా ఉన్న వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీడీఏ), స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో విస్తరణ పనులు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విస్తరణ పనులపై సమీక్షల్లో ఆలయ నిర్వహణకు సంబంధించిన అంశాలు ఏ మేరకు చర్చకు వస్తున్నాయన్న ప్రశ్న తలెత్తుతోంది. పనుల ప్రగతితో పాటు దర్శన ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణ, భక్తుల వసతులపై క్రమం తప్పకుండా చర్చ జరగాలంటే దేవస్థానానికి పూర్తిస్థాయి పాలకమండలిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ అంశాలపై ఎవరు సమీక్షిస్తున్నారు, భక్తులు ఇచ్చే సూచనలు నిర్ణయాలు తీసుకునేవారి దాకా ఎలా చేరుతున్నాయో స్పష్టం చేయాలంటున్నారు. పాలకమండలి లేకపోవడంతో ఆలయ రోజువారీ నిర్వహణ బాధ్యతలు దేవాదాయ శాఖ అధికారులపైనే ఉన్నాయి. దర్శనానికి వచ్చినప్పుడు ఎదురయ్యే ఇబ్బందిని భక్తులు ఈఓ దృష్టికి తీసుకెళ్లవచ్చు. అయితే అదే సమస్య ఉత్సవాలప్పుడల్లా ఎదురైతే, దానికి శాశ్వత పరిష్కారం ఏమిటన్నది సమీక్షలో తేలాలి. క్యూలైన్లలో తాగునీరు, వృద్ధులు కూర్చునేందుకు చోటు, దివ్యాంగులు ఆలయంలోకి వెళ్లేందుకు అనువైన దారి, రద్దీ రోజుల్లో ప్రవేశం, బయటకు వెళ్లే ఏర్పాట్లు వంటి అంశాలను స్థానికులు ప్రస్తావిస్తున్నారు. ఫిర్యాదులపై ఏ చర్య తీసుకున్నారు, వసతుల కల్పనకు ఏ పనులు చేపడతారో అడిగి తెలుసుకునేందుకు పాలకమండలి ఒక వేదికగా ఉంటుందని చెబుతున్నారు. చైర్మన్‌తో పాటు సభ్యులను నియమించి పూర్తిస్థాయి పాలకమండలిని ఏర్పాటు చేయాలన్నది భక్తుల డిమాండ్. నియామకం ఆలస్యానికి కారణమేమిటో, ప్రక్రియ ప్రస్తుతం ఏ దశలో ఉందో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.



భారత్‌లో ఆర్థిక విపత్తు

మొదటి పేజీ తరువాయి

ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' పథకాలు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టలేకపోయాయని విమర్శించారు. ఐఐటీ, ఐఐఎం డిగ్రీలు ఉన్నవారికీ ఉద్యోగ భరోసా కరువైందన్నారు. రాజకీయ, ఆర్థిక అధికారం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోందని రాహుల్ ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా రైతులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు అవసరమని, ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. విదేశీ వేదికలపై భారత్‌ను అవమానించడం రాహుల్‌కు అలవాటుగా మారిందని బీజేపీ విమర్శించింది. వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తున్న సమయంలో ఆయన వ్యాఖ్యలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని మండిపడింది.

ఓయూలో ఖాకీల జులుం!

మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదులకు యూనివర్సిటీ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉండగా, పోలీసులు కేసుల పేరుతో విద్యార్థినులను భయపెట్టారని ఓయూ విద్యార్థి జన సమితి (వీజేఎస్) నేత కె. రమేశ్ యాదవ్ మండిపడ్డారు.

గిన్నెలతో రోడ్డుపై బైఠాయింపు

లేడీస్ హాస్టల్‌లో భోజనం బాగోలేదని పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా స్పందించలేదన్నారు. సోమవారం అన్నం, కూరల గిన్నెలతో హాస్టల్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఉన్నతాధికారులు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి గిన్నెలు తట్టి మరోసారి నిరసన తెలిపారు. విద్యార్థినుల ఫిర్యాదులపై వీసీ, రిజిస్ట్రార్, చీఫ్ వార్డెన్, హాస్టల్ వార్డెన్లు స్పందించాల్సిందని రమేశ్ యాదవ్ అన్నారు. విద్యార్థినులను నిలబెట్టి పోలీసులు కుర్చీల్లో కూర్చోవడం ఏమిటని ప్రశ్నించారు. కేసుల పేరుతో భయపెట్టడాన్ని ఖండిస్తూ, ఇది ఓయూ విద్యార్థులందరికీ జరిగిన అవమానమని అన్నారు. డీ, ఈ1, ఈ2 హాస్టళ్లలో ప్రస్తుత, పూర్వ విద్యార్థులు ఉంటున్నారని, ఒకరిద్దరిని చూపించి అక్కడున్న వారంతా బయటి వ్యక్తులేనన్నట్టు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. విద్యార్థినుల ఫిర్యాదుల నేపథ్యంలో బుధవారం జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు లేడీస్ హాస్టల్ కిచెన్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, వంటగది పరిశుభ్రతను పరిశీలించారు. తాగునీటి నాణ్యతపైనా ఆరా తీశారు. విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు.

అంజన్న ఒంటిపై 100 కిలోల చందనం

మొదటి పేజీ తరువాయి

అనంతరం పంచనామా నిర్వహించి, తగిన భద్రతా చర్యలు చేపట్టి చందనాన్ని సీల్ చేసి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి, ప్రధానార్చకులు జితేంద్ర ప్రసాద్, చిరంజీవ స్వామి, మారుతీ ప్రసాద్, స్థానాచార్యులు కపిందర్, సహాయ కార్యనిర్వహణాధికారి హరిహరనాథ్, పర్యవేక్షకులు సునీల్ కుమార్, పరిశీలకులు అశోక్, లక్ష్మారెడ్డి, ఏఎస్ఐ రామయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

తీవ్ర తుపానుగా అక్వాన్

విశాఖపట్నం, నవంబర్ 18 (ఈవార్తలు): బంగాళాఖాతంలో దిశ మార్చుకున్న 'అక్వాన్' తీవ్ర తుపానుగా మారింది. ఈ నెల 20న మధ్యాహ్నం నరసాపురం–పూరీ మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపిం ది. శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో మోస్త రు నుంచి భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలోని ఇతర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే సూచన లున్నా యని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

కొడంగలే తెలంగాణ కాదు

మొదటి పేజీ తరువాయి

అన్నారు. మునుగోడు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఇప్పటికే వందసార్లు అడిగానని, ఇప్పుడు ఈ వేదికపైనా అదే కోరుతున్నానని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గతంలో కేసీఆర్ సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌పైనే దృష్టి పెట్టినప్పుడూ తాను ప్రశ్నించానని చెప్పారు. మునుగోడుకు తనదైన చరిత్ర ఉందని, తనను ఓడించేందుకు అప్పట్లో బీఆర్ఎస్‌కు చెందిన వంద మంది ఎమ్మెల్యేలు నియోజకవర్గానికి వచ్చారని గుర్తుచేశారు.



వైకుంఠ ద్వార దర్శనం.. 8.34 లక్షల మందికి చాన్స్



తిరుమల, నవంబర్ 18 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29 వరకు పది రోజుల పాటు 8.34 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. దర్శనాల్లో సామాన్య భక్తులకు 92 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. బుధవారం తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన టీటీడీ సాధికారిక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మండలి ఛైర్మన్ ముద్దాడ రవిచంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో భక్తుల దర్శనం కోసం స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్డీ) టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. తొలి రెండు రోజులు సాధారణ సర్వదర్శనం ఉండదని, ఆ తర్వాత ఎనిమిది రోజుల పాటు సర్వదర్శనం కొనసాగుతుందని వివరించారు. తిరుపతిలో అలిపిరి--ఎస్వీ జూ పార్క్ రోడ్డు సమీపంలోని టీటీడీ స్థలంలో రూ.2,750 కోట్ల శ్రీవాణి ట్రస్ట్ నిధులతో యాత్రికుల టౌన్‌షిప్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు డీపీఆర్, డిజైన్ల తయారీతో పాటు ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయనున్నారు. భక్తులకు ఆధునిక వసతి సౌకర్యాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని తెలిపారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల కేటాయింపులో భాగంగా 2007 సీనియారిటీ జాబితా ఆధారంగా మూడో విడతలో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి వారసులకు పల్లం గ్రామంలో ప్లాట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. మిగిలిన అర్హుల విషయాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నారు. పాదిరేడు వద్ద ఇళ్ల స్థలాల అభివృద్ధికి ఇప్పటికే కేటాయించిన రూ.230 కోట్లను ధ్రువీకరించారు. ఇందులో టీటీడీ 65 శాతం, ఉద్యోగులు లేదా స్థలాల కేటాయింపుదారులు 35 శాతం వ్యయాన్ని భరించనున్నారు.



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికే పెద్దపీట

విద్య, ఉపాధి, రాజకీయాల్లో అవకాశాలు కల్పిస్తున్నాం

పార్లమెంటరీ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి వివరణ

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఈ వర్గాలకు సముచిత అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ ఫగ్గన్‌సింగ్ కులస్తే, కమిటీ సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. దళితులకు శాసనసభ స్పీకర్, మంత్రి పదవుల్లో అవకాశాలు కల్పించామని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు వివిధ కార్పొరేషన్లలోనూ ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వందేళ్ల చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ ఛాన్సలర్‌గా నియమించినట్లు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐటీలలోనూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వీసీ పదవుల్లో అవకాశాలు కల్పించినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధుల్లో 50 శాతానికి పైగా ఈ వర్గాల కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ అమలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుపై పార్లమెంటరీ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రిని అభినందించినట్లు సమాచారం. సమావేశంలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, కమిటీ సభ్యులు తాపీర్ గావ్, హరీశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్‌కుమార్, ప్రసాదరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల లంచంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పట్టివేత

పెద్దపల్లి, నవంబర్ 18 (ఈవార్తలు): ఓ కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తానని చెప్పి లంచం తీసుకుంటున్న పెద్దపల్లి జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు పట్టుకున్నారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్‌రెడ్డి నేతృత్వంలోని బృందం బుధవారం దాడి చేసి రూ.1.50 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకుంది. 2023లో ధర్మారం మండలం రచ్చపల్లిలో జరిగిన భూ వివాదానికి సంబంధించిన గొడవలో ఒకరు మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులకు అనుకూలంగా వ్యవహరించి ప్రయోజనం కలిగేలా చూస్తానని రవీందర్ రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో సంబంధిత వ్యక్తులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అధికారుల సూచన మేరకు పెద్దపల్లిలో రూ.1.50 లక్షలు అందజేస్తుండగా రవీందర్‌ను పట్టుకున్నట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని ఘటనపై విచారణ కొనసాగిస్తున్నారు.

ఒలింపిక్స్ మాటలు సరే.. క్రీడాకారుల సమస్యలేవీ?

కోచ్‌లు, పీఈటీలు లేకుండా క్రీడాభివృద్ధి ఎలా?

సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తామని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలోని క్రీడాకారుల సమస్యలు కనిపించడం లేదా అని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ప్రశ్నించారు. క్రీడాకారులకు సరైన శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు, పాఠశాలల్లో పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు లేకుండా క్రీడాభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ప్రతినిధులు హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల విషయంలో ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ, ప్రోత్సాహకాలు కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. ఫుట్‌బాల్ కార్యక్రమాల కోసం రూ.100 కోట్ల ప్రభుత్వ నిధులు ఖర్చు చేశారని, క్రీడాకారుల అవసరాలకు మాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. ఖేలో ఇండియా పోటీలకు ప్రధానమంత్రిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వం ముందుగా రాష్ట్రంలో కోచ్‌ల నియామకంపై దృష్టి పెట్టాలని సూచించారు. పీఈటీలు, పీడీల ఖాళీల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోచ్‌లు లేకుండా స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యాలను ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రయాణ భత్యం, వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. క్రీడా బడ్జెట్‌ను పెంచడంతో పాటు నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ నిర్వహించాలని, తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటును వేగవంతం చేయాలని కోరారు. ఆధునిక శిక్షణ కేంద్రాలు, మైదానాలు, క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలన్నారు. క్రీడల్లో రాజకీయ జోక్యం లేకుండా ప్రతిభ ఆధారంగా అవకాశాలు కల్పించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

అయ్యప్ప భక్తులకు ప్రత్యేక రైళ్లు

చర్లపల్లి నుంచి కొల్లాంకు సర్వీసులు

శబరిమలలో దర్శనానికి విస్తృత ఏర్పాట్లు



హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్న నేపథ్యంలో చర్లపల్లి నుంచి కేరళలోని కొల్లాంకు ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. మరోవైపు 2026--27 మండల--మకరవిళక్కు యాత్రా సీజన్ ప్రారంభం కావడంతో కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు భక్తుల కోసం ఏర్పాట్లు చేశాయి. శబరిమలలో మండల పూజా కాలం నవంబర్ 17 నుంచి డిసెంబర్ 27 వరకు 41 రోజుల పాటు కొనసాగనుంది. డిసెంబర్ 27న మండల పూజ ముగిసిన తర్వాత ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తారు. మకరవిళక్కు ఉత్సవాల కోసం డిసెంబర్ 30న తిరిగి తెరుస్తారు. మకరజ్యోతి దర్శనం 2027 జనవరి 14న జరగనుంది. జనవరి 20తో యాత్రా సీజన్ ముగుస్తుంది. చర్లపల్లి నుంచి కొల్లాంకు ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 7.55 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి ఆదివారం ఉదయం ప్రత్యేక రైలు బయలుదేరి సోమవారం రాత్రి 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుగు రైలు బయలుదేరే సమయంపై అందిన వివరాల్లో స్వల్ప తేడా ఉన్నందున ప్రయాణికులు రైల్వే అధికారిక షెడ్యూల్‌ను పరిశీలించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాలు, నాందేడ్ ప్రాంతాల నుంచి 50కి పైగా ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉన్నట్లు సమాచారం. భక్తులు ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్లు రిజర్వ్ చేసుకోవచ్చు. చెంగన్నూ ర్ రైల్వే స్టేషన్, కొచ్చి విమా నాశ్రయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. శబరిమలలో రద్దీని నియం త్రించేందుకు వర్చువల్ క్యూ విధానాన్ని అమలు చేస్తున్నారు. రోజుకు సుమారు 60 వేల నుంచి 80 వేల మంది వరకు దర్శనానికి అవకాశం కల్పించేలా ఏర్పాట్లు చేశారు. పదునెట్టాంబడి 18 మెట్లను గంటకు సుమారు నాలుగు వేల మంది ఎక్కేలా నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు. రద్దీ పెరిగితే భక్తులను నిలక్కల్ వద్ద నిలిపేలా ఏర్పాట్లు చేశారు. నిలక్కల్‌లో రూ.4.5 కోట్లతో ఏఐ ఆధారిత పార్కింగ్ వ్యవస్థ, కెమెరాలు, తాగునీరు, భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. వర్చువల్ క్యూ ద్వారా బుక్ చేసుకున్న భక్తులకు ఎల్ఐసీ ద్వారా రూ.2 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ముంబయిలో ఆఫీసులు.. తెలంగాణలో పరిశ్రమలు!

పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పిస్తాం

పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానం



ముంబై, నవంబర్ 18 (ఈవార్తలు): ముంబైలో ప్రధాన కార్యాలయాలను కొనసాగిస్తూనే తెలంగాణలో ఉత్పత్తి, వ్యాపార కార్యకలాపాలను విస్తరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. పెట్టుబ డులకు అనువైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం ముంబయిలోని వర్లీ ఫోర్ సీజన్స్ హోటల్‌లో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారంతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026' రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ముంబయి నుంచి పెట్టుబడులను తరలించుకురావడం తమ ఉద్దేశం కాదని, అక్కడి సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలను కొనసాగిస్తూనే తెలంగాణలో కొత్త యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు వివరించారు. తెలంగాణ, ముంబయి మధ్య తరతరాలుగా వాణిజ్య, వ్యాపార సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణకు చెందిన కార్మికులు, చేతివృత్తులవారు, వ్యాపారవేత్తలు ముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సాంకేతిక రంగం, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), డేటా సెంటర్లు, ఫార్మా, టెక్స్‌టైల్స్, దుస్తుల తయారీ, మీడియా, వినోద రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నైపుణ్య మున్న మానవ వనరులు, ప్రభుత్వ విధానాలను వినియోగించుకోవాలని సూచించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'లో పాల్గొనాలని పారిశ్రామి కవేత్తలను ఆహ్వానించారు. పెట్టుబ డులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు అమలు చేస్తున్న టీజీ-ఐపాస్ విధానాన్ని వివరించారు. ముంబయి నుంచి తెలంగాణకు వచ్చే ప్రతి సంస్థకు ప్రత్యేక అధికారిని కేటాయిస్తామని ప్రకటించారు. పెట్టుబడులపై తొలి చర్చల నుంచి పరిశ్రమ కార్యకలాపాలు ప్రారంభించే వరకు ఆ అధికారి సహకారం అందిస్తారని తెలిపారు. తెలంగాణను 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు శ్రీధర్‌బాబు చెప్పారు. ఇందులో భాగంగా క్యూర్, ప్యూర్, రేర్ పేర్లతో పట్టణ, పట్టణ పరిసర, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొం దించినట్లు వివరించారు. సమావేశంలో సీఐఐ మహారాష్ట్ర రాష్ట్ర మండలి ఉపాధ్యక్షురాలు ఆర్తి కూచిభట్ల, టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో బి.అజిత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు. అనంతరం శ్రీధర్‌బాబు పలువురు పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమై పెట్టుబడి ప్రతిపాదనలపై చర్చించారు.

భూగర్భ జలాల పెంపునకు హైడ్రా ప్రణాళిక



హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లో పడిపోతున్న భూగర్భ జలమట్టాలను పెంచడంతో పాటు వర్షాకాలంలో వరద ముప్పును తగ్గించేందుకు హైడ్రా శాస్త్రీయ కార్యాచరణ రూపొందిస్తోంది. వర్షపు నీరు వృథాగా వెళ్లిపోకుండా సాధ్యమైనంత ఎక్కువగా భూమిలోకి ఇంకించేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. ఇందుకోసం చెరువులు, స్టెప్‌వెల్స్, రీఛార్జ్ పిట్స్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించనుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం హైడ్రా కార్యాలయంలో వివిధ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, అధికారులతో సమావేశమయ్యారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), తెలంగాణ భూగర్భ జల శాఖ, భారత వాతావరణ శాఖ (ఐఎండీ), తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) ప్రతినిధులు పాల్గొన్నారు. అర్బన్ ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ మూడో దశలో భాగంగా క్యూర్ పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నగరంలో ఎక్కడ భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి? ఎక్కడ జలమట్టాలు పడిపోయాయి? ఏ ప్రాంతాల్లో వర్షపు నీరు సులభంగా భూమిలోకి ఇంకుతుంది? అనే అంశాలను శాస్త్రీయంగా గుర్తించాలని నిర్ణయించారు. భూస్వరూపం, భూగర్భ పొరల స్వభావం, నేల రకాలు, నీటి నాణ్యత, రీఛార్జ్ సామర్థ్యం వంటి అంశాలపై అధ్యయనం చేయనున్నారు. నగరాన్ని క్యాచ్‌మెంట్, సబ్ క్యాచ్‌మెంట్ ప్రాంతాలుగా విభజించి వర్షపు నీటి ప్రవాహానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించనున్నారు. 2000 నుంచి 2025 వరకు 25 ఏళ్ల వర్షపాత గణాంకాలను విశ్లేషించాలని నిర్ణయించారు. ఏ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి? తక్కువ సమయంలో అత్యధిక వర్షపాతం ఎక్కడ నమోదవుతోంది? వరద ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాలేవి? అనే వివరాలను సేకరించనున్నారు. కొత్తగా ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు, రెయిన్ గేజ్ కేంద్రాల ఏర్పాటుపైనా చర్చించారు. వర్షపు నీటిని కేవలం బయటకు మళ్లించడమే కాకుండా భూగర్భ జలాల పెంపునకు ఉపయోగించుకోవడమే లక్ష్యమని రంగనాథ్ తెలిపారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టడం ద్వారా వరద ముప్పును తగ్గించడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణలో 240 కొత్త సహకార సంఘాలు

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్.. వికారాబాద్ జిల్లాకు 15 పీఏసీఎస్‌లు



హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణలో సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 240 కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే ఉన్న సంఘాల పునర్వ్యవస్థీకరణకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు నవంబర్ 11న ప్రభుత్వం మెమో జారీ చేసింది. నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి తదుపరి చర్యలు చేపట్టాలని వ్యవసాయ, సహకార శాఖ అధికారులను ఆదేశించింది. కొత్తగా ఏర్పాటు చేయనున్న సంఘాల్లో వికారాబాద్ జిల్లాకు 15 కేటాయించారు. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాల పరిధులను విభజించి వీటిని ఏర్పాటు చేయనున్నారు. వట్టిమీనపల్లి పరిధిలో చించల్‌పేట్, ఎల్లకొండ, పూడూరు పరిధిలో అంగడిచిట్టెంపల్లి, ఎల్మకన్న పరిధిలో గౌతాపూర్, నవాంద్గి పరిధిలో ఖాసింపూర్, యాలాల్ పరిధిలో లక్ష్మీనారాయణపూర్, హుస్నాబాద్ పరిధిలో రుద్రారం, దౌల్తాబాద్ పరిధిలో గోకఫసల్వాద్, శివారెడ్డిపేట్ పరిధిలో అత్వెల్లి, ధారూర్ పరిధిలో నాగారం, మర్పల్లి పరిధిలో పట్లూర్, మోమిన్‌పేట్ పరిధిలో వెంకటాల ప్రాంతాల్లో కొత్త సంఘాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే మెట్లకుంట పరిధిలో దుద్యాల్, కులకచర్ల పరిధిలో చౌడాపూర్, బంట్వారం పరిధిలో కోట్‌పల్లి సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇప్పటివరకు పీఏసీఎస్‌లు లేని మూడు మండలాలకు కొత్త సంఘాలు అందుబాటులోకి రానున్నాయి. కొత్త సంఘాల ఏర్పాటు పూర్తయితే రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు వంటి సేవలు మరింత చేరువ కానున్నాయి.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



టాస్క్‌ఫోర్స్ సోదాలపై హైకోర్టు నోటీసులు

డీజీపీ, హోంశాఖ, పోలీస్ కమిషనర్‌కు నోటీసులు

నిబంధనలు ఉల్లంఘిస్తున్నారన్న పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిబంధనలు పాటించకుండా సోదాలు, తనిఖీలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై దాఖలైన రిట్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ మాధవి దేవి రాష్ట్ర హోంశాఖ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీలకు నోటీసులు జారీ చేశారు. పిటిషన్‌లో లేవనెత్తిన ఆరోపణలపై పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. బోరబండకు చెందిన బి.బాలరాజ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది యూనిఫాం ధరించకుండా సాధారణ దుస్తుల్లో వచ్చి తనిఖీలు, సోదాలు నిర్వహిస్తున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే సోదాలు నిర్వహించడం, వస్తువులను స్వాధీనం చేసుకోవడం చట్టవిరుద్ధమని ఆరోపించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎఫ్ఐఆర్ నమోదుకు ముందే ఏకపక్షంగా దర్యాప్తు చేపట్టడం భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023 నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులకు తమ వాదన వినిపించే అవకాశం ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సెర్చ్ వారెంట్లు జారీ చేసే అధికారంపై కూడా పిటిషనర్ తరఫున అభ్యంతరాలు వ్యక్తం చేశారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు ఉన్న అధికారాలను ఏసీపీ స్థాయి అధికారులు వినియోగించడం చట్టబద్ధం కాదని వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రతివాదుల నుంచి వివరణ కోరింది. తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేసింది. అయితే టాస్క్‌ఫోర్స్ సోదాలు చట్టవిరుద్ధమని కోర్టు తుది నిర్ణయం వెల్లడించలేదు.

ఏపీ టన్నెల్‌పై తెలంగాణ ఎందుకు మౌనం?

నాగార్జునసాగర్ జలాల తరలింపుపై కవిత ప్రశ్నలు

హైదరాబాద్, నవంబర్ 18 (ఈవార్తలు): నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టన్నెల్ ప్రాజెక్టు చేపడుతున్నా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రం భారీ ప్రాజెక్టు పనులు చేపడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనంగా ఉండటంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి అక్రమంగా నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం భారీ టన్నెల్ ప్రాజెక్టు చేపట్టిందని కవిత ఆరోపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుమతితోనే ఈ పనులు జరుగుతున్నాయా అని నిలదీశారు. ఇంత పెద్ద ఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నా తెలంగాణ ప్రభుత్వానికి కనీస సమాచారం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర జల ప్రయోజనాలకు సంబంధించిన అంశంలో ప్రభుత్వం ఎందుకు మౌనంగా వ్యవహరిస్తోందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



భవనం అదే.. పన్ను మాత్రం సగానికి సగం!

జగిత్యాల మున్సిపాలిటీలో ఆస్తిపన్ను మదింపుపై అనుమానాలు

జీ ప్లస్ త్రీ భవనం రికార్డుల్లో జీ ప్లస్ వన్‌గా మారిందని ఆరోపణలు

రూ.1.21 లక్షల నుంచి రూ.47,748కు తగ్గిన వార్షిక పన్ను

జగిత్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపాలిటీలో ఓ భవనం ఆస్తిపన్ను మదింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. జీ ప్లస్ త్రీగా ఉన్నట్లు చెబుతున్న భవనాన్ని మున్సిపల్ రికార్డుల్లో జీ ప్లస్ వన్‌గా నమోదు చేసి, వార్షిక ఆస్తిపన్నును రూ.1,21,512 నుంచి రూ.47,748కు తగ్గించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణంలో మార్పులేమీ లేకుండానే నెల రోజుల వ్యవధిలో పన్ను రూ.73,764 తగ్గడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అంతస్తులు ఎలా తగ్గాయి?

జగిత్యాల కొత్త బస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన కటకం ప్రశాంత్‌కు చెందిన భవనానికి 2022లో జీ ప్లస్ త్రీ నిర్మాణ అనుమతులు పొందినట్లు సమాచారం. 2026లో తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ అధికారులు భవనాన్ని జీ ప్లస్ త్రీగా గుర్తించి వార్షిక ఆస్తిపన్ను రూ.1,21,512గా నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే నెల రోజులు గడవకముందే పునఃపరిశీలన పేరుతో అదే భవనాన్ని జీ ప్లస్ వన్‌గా నమోదు చేసి పన్నును రూ.47,748కు తగ్గించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో 214 చదరపు మీటర్లుగా నమోదైన ప్లింత్ ఏరియాను 107 చదరపు మీటర్లకు తగ్గించినట్లు చెబుతున్నారు. భవనం విస్తీర్ణం సగానికి తగ్గడానికి కారణాలేమిటి? క్షేత్రస్థాయిలో మరోసారి తనిఖీలు నిర్వహించారా? రికార్డుల మార్పునకు ఎవరు అనుమతి ఇచ్చారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పన్ను తగ్గింపు వెనుక ఎవరి పాత్ర?

ఈ వ్యవహారంలో రూ.2 లక్షలకు పైగా చేతులు మారాయనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల సిబ్బంది పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గంలోని ఓ కీలక నేత అండదండలతోనే పన్ను తగ్గింపు జరిగిందనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ లేదు. సామాన్యుల ఇళ్లకు ఆస్తిపన్ను బకాయిలుంటే నోటీసులు జారీ చేసే అధికారులు, భారీ మొత్తంలో పన్ను తగ్గించినట్లు ఆరోపణలు వచ్చిన వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పన్ను తగ్గించినట్లు తేలితే మున్సిపాలిటీ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. 2022 నాటి భవన నిర్మాణ అనుమతులు, 2026 క్షేత్రస్థాయి తనిఖీ నివేదికలు, ఆస్తిపన్ను మదింపు రికార్డులు, పునఃపరిశీలనకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. భవనంలో మార్పులు లేకుండానే రికార్డుల్లో అంతస్తులు, విస్తీర్ణం ఎలా తగ్గాయి? పన్ను తగ్గింపు నిబంధనల ప్రకారమే జరిగిందా? ఈ నిర్ణయానికి బాధ్యులెవరు? అనే ప్రశ్నలకు మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలని కోరుతున్నారు.

కూకట్‌పల్లిలో 4,092 మందికి కొత్త పింఛన్లు



కూకట్‌పల్లి, నవంబర్ 18 (ఈవార్తలు): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో కొత్తగా 4,092 పింఛన్లు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మూసాపేట్‌లోని ఆంజనేయనగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్‌పల్లి, మూసాపేట్, బోయిన్‌పల్లి సర్కిళ్ల పరిధిలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. నియోజకవర్గంలో గత మూడేళ్లలో 20 వేల మందికి కొత్త రేషన్ కార్డులు అందించామని పేర్కొన్నారు. సున్నం చెరువు, నల్ల చెరువుల అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మూసాపేట్ వద్ద రూ.180 కోట్లతో బ్రిడ్జి, జేఎన్‌టీయూ వద్ద స్కైవాక్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారి వైద్య చికిత్సకు రూ.5 లక్షల ఎల్‌ఓసీ

మల్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రానికి చెందిన ఏడాది వయసున్న చిన్నారి కొండూరి హాత్విక వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. చిన్నారి తండ్రి నవీన్ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేందుకు చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చిన్నారికి అత్యవసర ఆపరేషన్ నిర్వహించేందుకు అవసరమైన వైద్య ఖర్చుల కోసం ఈ నిధులు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాన్ని చిన్నారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అత్యవసర సమయంలో వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కుటుంబ సభ్యులు



కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు వైద్య సహాయం అందించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

మండలంలో కొత్తగా మంజూరైన వివిధ రకాల పింఛన్ల పత్రాలను చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా పింఛన్లు, ఒంటరి మహిళల పింఛన్లతోపాటు ఇతర పింఛన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర అర్హులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మల్యాల సర్పంచ్ బొట్ల జయ, గ్రామపంచాయతీ ఈవో శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి

కొడిమ్యాలలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

కేటీఆర్ హాజరుకానున్నారని వెల్లడించిన జీవన్‌రెడ్డి

జగిత్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): దీక్షా దివస్ స్ఫూర్తి సభను విజయవంతం చేసి రాష్ట్రమంతా మరోసారి కరీంనగర్ వైపు చూసేలా చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం కొడిమ్యాలలో కొడిమ్యాల, మల్యాల మండలాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమంలో కీలక మలుపుగా నిలిచిందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ దీక్షా దివస్ స్ఫూర్తి సభకు మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ సమక్షంలో పలువురు మాజీ



ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాలలో కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

జగిత్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్ల పత్రాలను బుధవారం జగిత్యాలలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న దేవిశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అర్హులైన పేదలకు కొత్త పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, 34వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఎండీ అయ్యూబ్‌ఖాన్, వార్డు అధికారి, నాయకులు కమల్‌భాయ్, సిరాజుద్దీన్, మన్సూర్, కాజీమ్ అలీ, రజి ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అటు.. బీర్పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన చేయూత పింఛన్ల పత్రాలను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కమ్మునూర్ గ్రామంలో సర్పంచ్ తోట శ్రీనివాస్ పింఛన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. తాళ్లధర్మారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ వినోద్-లక్ష్మణ్ ఆధ్వర్యంలో పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచంద్రరావు, ఎంపీడీవో బీమేష్, ఉపసర్పంచ్ బత్తుల పద్మ-రాజేష్, వార్డు సభ్యులు రాజమౌళి, సత్యంరెడ్డి, శ్రీనివాస్, శేఖర్, జగదీష్, నర్సింగ్, బీమక్క, మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ జోగిరెడ్డి, నాయకులు రాజన్న, భూమేష్, మల్లేష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొడిమ్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): నవోదయ గ్రామ సంఘం ఆధ్వర్యంలో కొడిమ్యాలలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సర్పంచ్ జీవన్‌రెడ్డి, తహసీల్దార్ నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఏడు రకాల సన్నధాన్యానికి కనీస మద్దతు ధరతోపాటు అదనపు బోనస్ కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

VANGS GLOBAL TECHNOLOGIES LLP

DASARA SPECIAL OFFER

Launch Your Cloud-Hosted ePaper Today

Powering modern newsrooms with AI-powered image extraction & multi-language support

ePaper Pro దసరా శుభాకాంక్షలు

20% OFF ON EVERY PLAN

NEWS ONLY website · web stories · breaking news

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹8,124 ₹6,499
20% OFF · SAVE ₹1,625 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹12,499 ₹9,999
20% OFF · SAVE ₹2,500 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹16,249 ₹12,999
20% OFF · SAVE ₹3,250 / YEAR

ePAPER ONLY PDF to Interactive ePaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Unlimited pageviews & SEO
✓ Country & device-wise views
₹9,999 ₹7,999
20% OFF · SAVE ₹2,000 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app & email support
✓ Drag & drop theme builder
✓ Employee ID card design
✓ Custom domain & push alerts
₹14,999 ₹11,999
20% OFF · SAVE ₹3,000 / YEAR

Full Press 15 GB · 30 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Custom domain & push alerts
₹19,999 ₹15,999
20% OFF · SAVE ₹4,000 / YEAR

NEWS + ePAPER the complete digital newspaper

Standard 5 GB · 5 users — SAVE 20%
✓ Automatic PDF extraction
✓ Custom domain & push alerts
✓ Web stories, gallery, headlines
✓ Country & device-wise views
₹17,499 ₹13,999
20% OFF · SAVE ₹3,500 / YEAR

Expanded 10 GB · 10 users — SAVE 20%
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹22,499 ₹17,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

Full Press 15 GB · 30 users — BEST VALUE
✓ Android app + configuration
✓ WhatsApp & email support
✓ Theme builder & ID card design
✓ Web stories, gallery, headlines
₹32,499 ₹25,999
20% OFF · SAVE ₹4,500 / YEAR

PLATFORM HIGHLIGHTS
◆ Smart AI image extraction ◆ One-click publishing ◆ Real-time analytics
◆ AdSense & sponsor ad slots ◆ WhatsApp sharing ◆ AWS cloud - daily backups
◆ Custom domain + auto SSL ◆ AI tagging & SEO tags ◆ YouTube Video embedding

Try free for 12 days
No credit card required - Turn your print edition into a digital publication
CALL / WHATSAPP +91 7675087378
EMAIL hr@vangstechnologies.com
WEBSITE www.vangstechnologies.com
SCAN TO VISIT OUR WEBSITE
SCAN TO CALL +91 7675087378



యాపిల్ మ్యాప్స్‌లో తెలుగు

భారత్ కోసం కొత్త డిజైన్

3డీ కట్టడాలు, మెరుగైన నావిగేషన్

న్యూఢిల్లీ, నవంబర్ 18 (ఈవార్తలు): భారతీయ వినియోగదారుల కోసం యాపిల్ తన మ్యాప్స్ సేవలను కొత్త రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ప్రకటించింది. దేశీయ రహదారుల పరిస్థితులు, స్థానిక ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నావిగేషన్ సదుపాయాలను మెరుగుపరిచింది. తెలుగు సహా పలు భారతీయ భాషల్లో పేర్లను చూపించే సదుపాయాన్ని చేర్చింది. కొత్త అప్‌డేట్‌లో ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, తమిళం, పంజాబీ, ఒడియా, ఉర్దూ భాషల్లో లొకేషన్ పేర్లను చూడవచ్చు. యూజర్ సెట్టింగ్స్, ప్రాంతాన్ని బట్టి రెండు భాషల్లో పేర్లను చూపించే డ్యూయల్ లాంగ్వేజ్ లేబుల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీధుల పేర్లు స్పష్టంగా కనిపించని ప్రాంతాల్లో సమీపంలోని ప్రముఖ ప్రదేశాల ఆధారంగా దారి సూచించే 'నేచురల్ లాంగ్వేజ్ గైడెన్స్'ను ప్రవేశపెట్టింది. సరైన లేన్‌లో వెళ్లేందుకు లేన్ గైడెన్స్, ఒకే ప్రయాణంలో గరిష్ఠంగా 15 గమ్యస్థానాలను చేర్చుకునే మల్టీ స్టాప్ రూటింగ్, ప్రయాణ సమయాన్ని ఇతరులతో పంచుకునే షేర్ ఈటీఏ వంటి సదుపాయాలను జోడించింది. సిరి ద్వారా రోడ్డు ప్రమాదాలను రిపోర్ట్ చేసే ఆప్షన్‌తో పాటు ఎలక్ట్రిక్ వాహనాల కోసం ప్రత్యేక రూట్ ప్లానింగ్‌ను తీసుకొచ్చింది. ఐఫోన్ కెమెరా సాయంతో నడిచేటప్పుడు దారి చూపించే ఆగ్మెంటెడ్ రియాలిటీ వాకింగ్ డైరెక్షన్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. 'లుక్ అరౌండ్' ఫీచర్ ద్వారా వీధులను స్ట్రీట్ లెవల్‌లో వీక్షించవచ్చు. దేశవ్యాప్తంగా 300కు పైగా ప్రముఖ చారిత్రక కట్టడాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలను 3డీ రూపంలో చూసే సదుపాయం కల్పించింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, అహ్మదాబాద్, పుణే నగరాల్లో పబ్లిక్ ట్రాన్సిట్ వివరాలను చేర్చింది. రైల్వే, మెట్రో ప్రయాణికులకు స్టేషన్ల వివరాలు, గమ్యస్థానానికి చేరుకునే సమయంలో అలర్ట్స్ అందించే సదుపాయాలను జోడించింది. యూజర్ల గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు యాపిల్ తెలిపింది. మ్యాప్స్ వినియోగానికి ప్రత్యేకంగా సైన్ ఇన్ అవసరం లేదని వెల్లడించింది. కొత్త ఫీచర్లు ఐఓఎస్ 27.2, ఐప్యాడ్ ఓఎస్ 27.2, వాచ్ ఓఎస్ 27.2, మ్యాక్ ఓఎస్ 27.2 లేదా ఆ తర్వాతి వెర్షన్లలో అందుబాటులో ఉంటాయని పేర్కొంది.



నేవీకి రూ.1,976 కోట్ల రక్షణ కవచం

ఇజ్రాయెల్ సంస్థతో ఒప్పందం

బరాక్ క్షిపణి వ్యవస్థల ఆధునికీకరణ

న్యూఢిల్లీ, నవంబర్ 18 (ఈవార్తలు): భారత నౌకాదళ యుద్ధనౌకల రక్షణ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. యుద్ధనౌకల్లో అమర్చిన బరాక్ పాయింట్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్‌ల ఆధునికీకరణ, నిర్వహణ కోసం ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌తో రూ.1,976.40 కోట్ల విలువైన ఒప్పందం చేసుకుంది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా బరాక్ క్షిపణి వ్యవస్థల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నారు. పాత విడిభాగాల స్థానంలో ఆధునిక పరికరాలను అమర్చనున్నారు. దీనివల్ల శత్రు విమానాలు, క్షిపణి దాడులను ఎదుర్కొనే నౌకాదళ గగనతల రక్షణ సామర్థ్యం పెరుగుతుందని రక్షణ శాఖ తెలిపింది. నవంబర్‌లో భారత నౌకాదళానికి సంబంధించి ఇది మూడో కీలక ఒప్పందమని అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 11న కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌తో రూ.498.58 కోట్ల ఒప్పందం కుదిరింది. ఐఎన్ఎస్ బెత్వా యుద్ధనౌక మరమ్మతులు, ఇంజిన్ ఆధునికీకరణ కోసం ఈ నిధులు కేటాయించారు. పాత స్టీమ్ ప్రొపల్షన్ స్థానంలో డీజిల్ ఇంజిన్ ప్రొపల్షన్ వ్యవస్థను అమర్చడంతో పాటు ఆధునిక ఆయుధాలను జోడించనున్నారు. అంతకుముందు నవంబర్ 2న రూ.53,866.50 కోట్లతో ఎనిమిది నెక్స్ట్ జనరేషన్ కార్వెట్‌ల నిర్మాణానికి ఒప్పందాలు కుదిరాయి. వీటిలో ఐదు కార్వెట్‌లను కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్, మూడింటిని గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించనున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా రాబోయే పదేళ్లలో షిప్‌యార్డుల్లో దాదాపు 72 లక్షల పనిదినాలు, అనుబంధ పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల్లో సుమారు 460 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా వేశారు. స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబన సాధించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపడుతోంది.

ఐసీఐసీఐ క్రెడిట్ కార్డులపై కొత్త ఛార్జీలు

నవంబర్ 25 నుంచి మార్పులు

డిసెంబర్ 15 నుంచి కొన్ని ఉచిత ప్రయోజనాల రద్దు

ముంబై, నవంబర్ 18 (ఈవార్తలు): ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు పలు నిబంధనలను మార్చింది. కొన్ని ఉచిత ప్రయోజనాలను తొలగించడంతో పాటు వివిధ సేవలపై ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. కొత్త ఛార్జీల్లో కొన్ని నవంబర్ 25 నుంచి అమల్లోకి రానున్నాయి. ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై అందిస్తున్న ఉచిత ఐనాక్స్ సినిమా టికెట్ల ప్రయోజనాన్ని డిసెంబర్ 15 నుంచి నిలిపివేయనుంది. రూబిక్స్, కోరల్, ఎక్స్‌ప్రెషన్స్, మేక్‌మైట్రిప్ ప్లాటినం, మేక్‌మైట్రిప్ సిగ్నేచర్, హెచ్‌పీసీఎల్ సూపర్ సేవర్, ఎమిరేట్స్ రూబిక్స్ కార్డులకు ఈ మార్పు వర్తించనుంది. అలాగే కొన్ని కార్డులపై అందిస్తున్న ఉచిత వ్యక్తిగత ప్రమాద బీమా, విమాన ప్రమాద బీమా, ప్రయాణ రద్దు బీమా ప్రయోజనాలను కూడా ఉపసంహరించనుంది. ఎమరాల్డ్, శాఫైరో, రూబిక్స్, పరాక్రమ్ వంటి కార్డులపై ఈ మార్పులు ప్రభావం చూపనున్నాయి. విదేశాల్లో నమోదైన వ్యాపారులతో భారత రూపాయల్లో జరిపే లావాదేవీలపై విధించే డైనమిక్ కరెన్సీ కన్వర్షన్ ఫీజును 1 శాతం నుంచి 3.50 శాతానికి పెంచనుంది. ఈ మార్పు నవంబర్ 25 నుంచి అమల్లోకి వస్తుంది. క్రెడిట్ కార్డు పోయినా, దెబ్బతిన్నా కొత్త కార్డు పొందేందుకు చెల్లించాల్సిన రీప్లేస్‌మెంట్ ఛార్జీని రూ.200 నుంచి రూ.300కు పెంచింది. దీనికి జీఎస్టీ అదనంగా వర్తిస్తుంది. తాజా మార్పులతో కొన్ని సేవలకు కార్డుదారులు అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

ఒకే వేదికపై మూడు అగ్రరాజ్యాలు

చైనాలో అపెక్ సదస్సు

ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ భేటీపై ఉత్కంఠ



షెన్‌జెన్, నవంబర్ 18 (ఈవార్తలు): చైనాలోని షెన్‌జెన్‌లో జరుగుతున్న ఆసియా-పసిఫిక్ ఎకనామిక్ కోఆపరేషన్ (అపెక్) సదస్సు అంతర్జాతీయంగా ఆసక్తి రేపుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఒకే వేదికపైకి రావడంతో మూడు దేశాల అధినేతల మధ్య జరగనున్న త్రైపాక్షిక సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. సదస్సులో పాల్గొనేందుకు చైనా చేరుకున్న ట్రంప్‌కు షెన్‌జెన్ విమానాశ్రయంలో జిన్‌పింగ్ స్వయంగా స్వాగతం పలికినట్లు కథనాలు వెల్లడించాయి. ఈ భేటీ గంటలోపే ముగియవచ్చని క్రెమ్లిన్ వర్గాలు తెలిపాయి. త్రైపాక్షిక సమావేశానికి ముందు జిన్‌పింగ్, పుతిన్ సుమారు రెండు గంటలపాటు ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా పశ్చిమ దేశాలు విధిస్తున్న ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను పుతిన్ విమర్శించారు. ఆంక్షలు, సుంకాలతో ఏ దేశ ఆర్థిక వ్యవస్థనూ అణచివేయలేరని పేర్కొన్నారు. పశ్చిమ దేశాల ఒత్తిళ్లను ఎదుర్కొంటూనే రష్యా ఆర్థికంగా బలపడిందని చెప్పారు. రష్యా-చైనా మధ్య వాణిజ్యం, ఇంధనం, సాంకేతిక రంగాల్లో సహకారం పెరిగిందని వివరించారు. రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడిందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. మూడు దేశాల అధినేతల సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధం, అణ్వాయుధాల నియంత్రణ, అంతర్జాతీయ వాణిజ్యం, ఏఐ భద్రత వంటి అంశాలు చర్చకు రానున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. అయితే తమ దేశ భవిష్యత్తుకు సంబంధించిన చర్చల్లో ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం లేకపోవడంపై అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ లేకుండా తమ భవిష్యత్తుపై నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. యుద్ధాన్ని నిలిపివేసేలా పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావాలని ట్రంప్, జిన్‌పింగ్‌లకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు సదస్సు సందర్భంగా కెన్యా, మెక్సికో అధ్యక్షులతో పాటు కెనడా ప్రధాని మార్క్ కార్నేతో ట్రంప్ సమావేశమైనట్లు కథనాలు వెల్లడించాయి. కెనడాతో వాణిజ్య ఒప్పందాలు, మెక్సికోతో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించినట్లు తెలిపాయి. మూడు అగ్రరాజ్యాల అధినేతల సమావేశం నుంచి ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్నది ఆసక్తికరంగా మారింది.

డ్రగ్స్‌పై యుద్ధం చేయాల్సిందే

యువత భవిష్యత్తుపై ఆందోళన

వ్యక్తం చేసిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, నవంబర్ 18 (ఈవార్తలు): దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. నక్సలిజాన్ని అరికట్టిన తరహాలోనే డ్రగ్స్ మహమ్మారిని కూడా అంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం తన అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశంలో యువతపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని భావోద్వేగానికి గురైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో పేదరిక నిర్మూలన, నక్సలిజం నియంత్రణ అంశాలపై ప్రధానంగా చర్చించారు. హోం, ఆర్థిక మంత్రిత్వ శాఖలతో పాటు వివిధ శాఖలకు చెందిన 11 మంది సీనియర్ కార్యదర్శులు సమగ్ర ప్రజెంటేషన్లు ఇచ్చారు. గత సెప్టెంబర్‌లో నిర్వహించిన చింతన్ శిబిర్‌కు కొనసాగింపుగా జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు మరింత సమర్థంగా చేరవేసే మార్గాలపై చర్చించారు. 2011 నుంచి 2023 మధ్య దేశంలో దాదాపు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొన్న విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. తీవ్ర పేదరికం రేటు గణనీయంగా తగ్గిందని అధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదరిక నిర్మూలనకు దోహదపడ్డాయని మంత్రి మండలి అభిప్రాయపడింది. ఇటీవల ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఆసియాన్-ఇండియా సదస్సులో పాల్గొని తిరిగివచ్చిన మోదీ.. యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడుకోవడం దేశానికి అత్యంత ముఖ్యమని పేర్కొన్నట్లు సమా చారం. మాదకద్రవ్యాల సమస్యను నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నక్సలిజం నియంత్రణపై జరిగిన చర్చల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మందికి పైగా సిబ్బంది ఉన్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌ను మణిపూర్‌కు తరలించినట్లు కథనం పేర్కొంది. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మహిళలు, యువతకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని మంత్రులు, అధికారులకు ప్రధాని సూచించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

సీజేఐపై వ్యాఖ్యలు.. లాయర్‌కు నోటీసులు

జనవరి 8లోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ, నవంబర్ 18 (ఈవార్తలు): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాది ప్రవీణ్ సింఘాల్‌కు సుప్రీంకోర్టు క్రిమినల్ ధిక్కార నోటీసులు జారీ చేసింది. జనవరి 8లోగా వివరణ ఇవ్వాలని, జనవరి 20న జరిగే తదుపరి విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా న్యాయవాది నుంచి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. సోమవారం మధ్యాహ్నం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రవీణ్ సింఘాల్ తన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరారు. నవంబర్ 2న సీజేఐ కార్యాలయంలో పిటిషన్ సమర్పించినప్పటికీ 15 రోజులైనా స్పందన రాలేదని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా కేసును ప్రస్తావించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. త్వరగా లిస్టింగ్ చేయాలనుకుంటే రిజిస్ట్రార్‌ను సంప్రదించాలని సూచించింది. అయినా తన పిటిషన్ ఎందుకు లిస్ట్ కాలేదో చెప్పాలని న్యాయవాది పట్టుబట్టారు. ఈ విషయాన్ని స్వయంగా పరిశీలిస్తానని, నిబంధనల ప్రకారం వేచి ఉండాలని సీజేఐ సూచించారు. ఈ క్రమంలో న్యాయవాది సీజేఐపై వ్యక్తిగత విమర్శలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి పదవిలో కూర్చునే అర్హత లేదంటూ వ్యాఖ్యానించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్.. న్యాయవాదిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.ఖ

యూపీలో 320 సీట్లు దాటుతాం

మూడోసారి అధికారంలోకి రావడం

ఖాయమన్న సీఎం యోగి



లక్నో, నవంబర్ 18 (ఈవార్తలు): ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ధీమా వ్యక్తం చేశారు. తమ కూటమి 320కిపైగా స్థానాలను గెలుచుకుంటుందని అంచనా వేశారు. గత ఎన్నికల రికార్డులను కూడా అధిగమిస్తామని పేర్కొన్నారు. రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న యోగి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. గత ప్రభుత్వాల పాలనకు, ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో ఉన్న పరిస్థితులకు మధ్య తేడాను ప్రజల ముందు ఉంచి ఓట్లు అడుగుతామని తెలిపారు. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌పై యోగి తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వాలు కుటుంబ పాలన, కుల రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చాయని ఆరోపించారు. వాటి కారణంగా ఉత్తరప్రదేశ్ అభివృద్ధిలో వెనుకబడిం దన్నారు. ఒకప్పుడు రాష్ట్రంలో కర్ఫ్యూలు, అల్లర్లు, నేరాలు ఎక్కువగా ఉండేవని, ప్రస్తుతం పరిస్థితులు మారాయని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అల్లర్లు, శాంతిభద్రతల సమస్యలను ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుందని చెప్పారు. అల్లర్లకు పాల్పడేవారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. 2017కు ముందు సమాజ్‌వాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పెట్టుబడిదారులు ముందుకు రాలేదని యోగి విమర్శించారు. గత ముఖ్యమంత్రులు నోయిడాను సందర్శించేందుకు కూడా వెనుకాడేవారని వ్యాఖ్యానించారు. అభివృద్ధి కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధిని వ్యతిరేకించే కొన్ని వర్గాలు ఉన్నాయని, వారి ప్రయత్నాలు ఫలించవని అన్నారు. మరోసారి పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

వాట్సాప్ బ్యాకప్‌కు గూగుల్ డ్రైవ్ అవసరం లేదా?

సొంత సర్వర్లలో 2 జీబీ ఉచిత స్టోరేజ్‌కు ప్రణాళిక



న్యూఢిల్లీ, నవంబర్ 18 (ఈవార్తలు): వాట్సాప్ వినియోగదారులకు చాట్ బ్యాకప్ విషయంలో కొత్త సదుపాయం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గూగుల్ డ్రైవ్ వంటి థర్డ్ పార్టీ క్లౌడ్ సేవలపై ఆధారపడకుండా వాట్సాప్ సొంత సర్వర్లలోనే చాట్లను భద్రపరుచుకునే 'డైరెక్ట్ బ్యాకప్' ఫీచర్‌ను మెటా అభివృద్ధి చేస్తున్నట్లు కథనాలు వెల్లడించాయి. ఈ కొత్త సదుపాయం ద్వారా ప్రతి వినియోగదారుడికి 2 జీబీ వరకు ఉచిత స్టోరేజ్ అందించే అవకాశం ఉందని సమాచారం. బ్యాకప్ డేటాకు ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ రక్షణ కల్పించనున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. దీనివల్ల వ్యక్తిగత చాట్లు, ఇతర సమాచారం భద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ఉచితంగా అందించే 2 జీబీ కంటే ఎక్కువ స్టోరేజ్ అవసరమైన వారికి ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లు తీసుకురావాలని సంస్థ భావిస్తున్నట్లు సమాచారం. 'వాట్సాప్ వన్' పేరుతో 100 జీబీ వరకు, 'మెటా వన్' ద్వారా గరిష్ఠంగా 4 టీబీ వరకు స్టోరేజ్ అందించే అవకాశముందని కథనాలు పేర్కొన్నాయి. వాట్సాప్ వెర్షన్ 2.26.46.4లో ఈ ఫీచర్‌కు సంబంధించిన వివరాలు కనిపించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న ఈ సదుపాయాన్ని దశలవారీగా విడుదల చేయనున్నట్లు నివేదికలు తెలిపాయి. అయితే ఈ ఫీచర్ అందరికీ అందుబాటులోకి వచ్చినట్లు అధికారిక నిర్ధారణ లేదు. కొత్త బ్యాకప్ విధానం అమల్లోకి వస్తే గూగుల్ డ్రైవ్ స్టోరేజ్ పరిమితితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులకు ఉపయోగపడే అవకాశం ఉంది.



కుల్గాంలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హతం

శ్రీనగర్, నవంబర్ 18 (ఈవార్తలు): జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా దళాలు నిర్వహించిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ (23) హతమయ్యాడు. 'కేటగిరీ-ఎ' ఉగ్రవాదిగా గుర్తించిన అతడు స్థానిక మసీదులో దాక్కున్నట్లు సమాచారం అందడంతో భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. లతీఫ్‌ను ప్రాణాలతో పట్టుకునేందుకు వీడియో కాల్ ద్వారా లొంగిపోవాలని సూచించినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. అయితే అతడు లొంగిపోకుండా బలగాలపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పుల్లో హతమైనట్లు పేర్కొన్నాయి. ఆపరేషన్ సందర్భంగా మసీదుకు నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు వెల్లడించాయి. కశ్మీర్ లోయలో మిగిలి ఉన్న ఏకైక క్రియాశీల స్థానిక ఉగ్రవాది లతీఫ్ భట్ అని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. 2025 నవంబర్ 18న లష్కరే తొయిబాలో చేరిన అతడు సరిగ్గా ఏడాది తర్వాత ఎన్‌కౌంటర్‌లో మరణించినట్లు తెలిపాయి. దక్షిణ కశ్మీర్‌లో లష్కర్ స్థానిక కమాండర్‌గా పనిచేసిన లతీఫ్‌కు ది రెసిస్టెన్స్ ఫ్రంట్, కశ్మీర్ రివల్యూషనరీ ఆర్మీ సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉగ్రవాదంలో చేరకముందు అతడు వడ్రంగిగా పనిచేసినట్లు పేర్కొన్నారు. కుల్గాం ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో చేరి మధ్యలోనే చదువు మానేసినట్లు వివరించారు. జులై 22న అనంత్‌నాగ్‌లో ఓ పోలీస్ అధికారి హత్య, ఆగస్టు 1న కుల్గాంలో ఇద్దరు వలస కార్మికుల హత్యల్లో లతీఫ్ ప్రమేయం ఉన్నట్లు భద్రతా వర్గాలు ఆరోపించాయి. నవంబర్ 11న కుల్గాంలో సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టుపై జరిగిన దాడిలో ముగ్గురు జవాన్లు గాయపడిన ఘటనతోనూ అతడికి సంబంధం ఉందని పేర్కొన్నాయి.

స్టార్‌లింక్‌కు రిలయన్స్ సవాల్

1,600 ఉపగ్రహాలతో బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌కు ప్రణాళిక



ముంబై, నవంబర్ 18 (ఈవార్తలు): ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌కు పోటీగా దేశీయ ఉపగ్రహ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ గ్రూప్ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. అంతరిక్షం నుంచి హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు 1,600 ఉపగ్రహాలతో లో ఎర్త్ ఆర్బిట్ (ఎల్ఈవో) వ్యవస్థను నిర్మించాలని భావిస్తోంది. ఇందుకోసం దేశీయ, అంతర్జాతీయ ఉపగ్రహ తయారీ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు బ్లూమ్‌బెర్గ్ కథనం వెల్లడించింది. జియో ప్లాట్‌ఫామ్స్ వృద్ధికి తోడ్పడేలా ఈ ఉపగ్రహ నెట్‌వర్క్‌ను 2035 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రిలయన్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. భారతీయ ఉపగ్రహ తయారీ సంస్థలు, టెక్నాలజీ స్టార్టప్‌లు, పెద్ద పారిశ్రామిక సంస్థలతో భాగస్వామ్య అవకాశాలను పరిశీలిస్తోంది.ప్రస్తుతం భారత్‌లో ఏడాదికి 15 కంటే తక్కువ ఉపగ్రహాలు తయారవుతున్నాయని, రిలయన్స్ ప్రణాళిక అమలు కావాలంటే ఏటా దాదాపు 200 ఉపగ్రహాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని కథనం పేర్కొంది. ఇందుకోసం దేశీయ తయారీతో పాటు విదేశీ సంస్థల నుంచి ఉపగ్రహాలను కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు తెలిపింది. అమెరికా నుంచి కనీసం 400 ఉపగ్రహాలను సేకరించే అంశాన్ని రిలయన్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రెండు అమెరికా కంపెనీలు, యూరప్ సరఫరాదారులతో చర్చలు జరుపుతున్నట్లు కథనం వెల్లడించింది. అయితే చైనా సంస్థలను ఈ ప్రాజెక్టుకు దూరంగా ఉంచినట్లు పేర్కొంది. సెప్టెంబర్ 2027లో తొలి ప్రయోగాత్మక పరీక్ష నిర్వహించి, 2028 ప్రారంభం నుంచి ఉపగ్రహ ప్రయోగాలను విస్తరించాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. దేశీయ కనెక్టివిటీ అవసరాలతో పాటు సరిహద్దు భద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలకు ఉపయోగపడే నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యమని కథనం పేర్కొంది. స్టార్‌లింక్‌కు ప్రపంచవ్యాప్తంగా 10 వేలకుపైగా ఉపగ్రహాలు ఉన్నప్పటికీ రిలయన్స్ ప్రధానంగా భారత అవసరాలపై దృష్టి పెట్టినట్లు తెలిపింది. యుద్ధాలు, సరిహద్దు ఉద్రిక్తతల సమయంలో విదేశీ ఉపగ్రహ సేవలపై ఆధారపడకుండా దేశీయ నియంత్రణలో ఉండే వ్యవస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఈ ప్రాజెక్టును పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కొడిమ్యాల అధ్యక్షుడు

కొడిమ్యాల, నవంబర్ 18 (ఈవార్తలు): కొడిమ్యాల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తూరి స్వామి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొత్తూరి స్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడంతోపాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగడం సంతోషంగా ఉందన్నారు.





వెంకీ వస్తే ఇంటి గేట్లు తీయను: చిరంజీవి

ఈవార్తలు, వినోదవాణి: దర్శకుడు వెంకీ కుడుములపై చిరంజీవి చేసిన సరదా వ్యాఖ్యలు 'ఇట్లు అర్జున' సినిమా సక్సెస్ మీట్‌లో నవ్వులు పూయించాయి. తనకు కథ చెబుతానని చెప్పిన వెంకీ ఇప్పటివరకు రాలేదని, పైగా నిర్మాతగా మారి యువ హీరోలతో సినిమాలు చేస్తున్నాడని చిరంజీవి చమత్కరించారు. అనీశ్ రెడ్డి హీరోగా, మహేశ్ ఉప్పల దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇట్లు అర్జున' నవంబర్ 13న విడుదలైంది. అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున సమర్పించగా, వెంకీ కుడుముల నిర్మించారు. సినిమా విజయోత్సవాన్ని హైదరాబాద్‌లో నిర్వహించగా చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. వెంకీ కుడుముల సినిమాల్లో కామెడీ టైమింగ్ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. "నేను ఎవరినీ నాతో సినిమా చేస్తావా అని అడగలేదు. కానీ ఈ దుర్మార్గుడిని మాత్రం అడిగాను. మంచి కథతో వస్తానని చెప్పాడు. అప్పటి నుంచి ఎదురుచూస్తున్నాను. చివరికి నాకు హ్యాండ్ ఇచ్చాడు" అంటూ నవ్వించారు. కథతో వస్తానన్న వెంకీ ఇప్పుడు నిర్మాతగా మారాడని, తనతో సినిమా చేయకుండా యువ హీరోలతో సినిమాలు తీస్తున్నాడని చిరంజీవి అన్నారు. అందుకే ఇకపై వెంకీ తన ఇంటికి వచ్చినా గేట్లు మూసే ఉంటాయని సరదాగా చెప్పారు. దీనికి వెంకీ స్పందిస్తూ.. "మీరు గేట్లు మూసేసినా దూకి వచ్చి కథ వినిపిస్తా" అని బదులిచ్చారు. ఈ సందర్భంగా హీరో అనీశ్ రెడ్డిని చిరంజీవి అభినందించారు. కొత్త హీరోకు సినీ పరిశ్రమలోని ప్రముఖుల మద్దతు లభించడం అరుదని, ఆ విషయంలో అనీశ్ అదృష్టవంతుడని అన్నారు.

రూ.1,500 కోట్లకు చేరువలో 'రామాయణ'

ఈవార్తలు, వినోదవాణి: రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'రామాయణ' భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన 13 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.1,483.50 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ ట్రాకర్ సాక్‌నిల్క్ పేర్కొంది. దీంతో సినిమా రూ.1,500 కోట్ల మైలురాయికి చేరువైంది. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 5న విడుదలైంది. ట్రేడ్ నివేదికల ప్రకారం.. నవంబర్ 17న, అంటే విడుదలైన 13వ రోజున భారత్‌లో రూ.28.70 కోట్ల నెట్ వసూళ్లు



సాధించింది. అంతకుముందు రోజు వచ్చిన రూ.32 కోట్లతో పోలిస్తే వసూళ్లు 10.3 శాతం తగ్గాయి. ఇప్పటివరకు దేశీయంగా రూ.821.30 కోట్ల నెట్, రూ.981.50 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విదేశాల్లో రూ.502 కోట్ల గ్రాస్ వసూలైంది. మొత్తం వసూళ్లలో ఓవర్సీస్ వాటా సుమారు 33.8 శాతంగా ఉంది. భాషల వారీగా చూస్తే హిందీ వెర్షన్ నుంచి అత్యధిక ఆదాయం వస్తోంది. 13వ రోజున హిందీలో రూ.21 కోట్లు, మలయాళంలో రూ.2.35 కోట్లు, కన్నడలో రూ.2.10 కోట్లు, తమిళంలో రూ.1.75 కోట్లు, తెలుగులో రూ.1.50 కోట్లు వసూలైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. తొలి ఎనిమిది రోజుల్లో భారత్‌లో రూ.564.60 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన ఈ చిత్రం రెండో వారంలోని పని దినాల్లో కొంత నెమ్మదించింది. అయితే విదేశాల్లో మంచి స్పందన కొనసాగుతోంది. ఐఎండీబీ పాపులారిటీ చార్ట్‌లో ఈ చిత్రం మూడో స్థానంలో నిలిచినట్లు సమాచారం.



భర్తతో కలిసి సమంత ప్రత్యేక పూజలు

ఈవార్తలు, వినోదవాణి: నటి సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం తొమ్మిదో నెల గర్భంతో ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇందుకు సంబంధించినవిగా ప్రచారంలో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంప్రదాయ దుస్తుల్లో సమంత పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు ఆ కథనాలు తెలిపాయి. మరోవైపు డెలివరీ సమయానికి సంబంధించిన సరదా మీమ్‌ను ఆమె ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసినట్లు పేర్కొన్నాయి. వారంలో ఏ రోజు ఏం చేయబోతున్నారని అడిగితే, ప్రతిరోజూ బహుశా బిడ్డకు జన్మనివ్వవచ్చనే సమాధానం ఉండేలా ఆ మీమ్ రూపొందింది. తొమ్మిదో నెలలోనూ సమంత ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతున్నారని, వెయిటెడ్ స్క్వాట్స్ వంటి వ్యాయామాలు చేస్తున్న వీడియోలు బయటకు వచ్చాయని సమాచారం. 2025 డిసెంబర్ 1న కోయంబత్తూరులోని ఈశా ఫౌండేషన్‌లో సమంత, రాజ్ నిడిమోరు వివాహం చేసుకున్నట్లు కథనంలో పేర్కొన్నారు. డిసెంబర్ మొదటి వారంలో ఆమె బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నప్పటికీ, డెలివరీ తేదీపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష

చెక్ బౌన్స్ కేసులో రూ.95 లక్షల జరిమానా



ఈవార్తలు, వినోదవాణి: చెక్ బౌన్స్ కేసులో సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు ఒంగోలు కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్ష విధించింది. దీంతోపాటు రూ.95 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశ్ భరించాలని తీర్పు ఇచ్చింది. కేసు వివరాల ప్రకారం.. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేశ్ తన నిర్మాణ సంస్థ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరుతో రూ.95 లక్షల చెక్ ఇచ్చారు. అయితే బ్యాంకు ఖాతాలో సరిపడా నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో వెంకటేశ్వర్లు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు. కేసును విచారించిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చింది. ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ.95 లక్షల జరిమానా విధించింది. బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా చెల్లించాలని ఆదేశించింది. గతంలోనూ బండ్ల గణేశ్‌పై చెక్ బౌన్స్ కేసులు నమోదయ్యాయి. కొన్ని కేసుల్లో కోర్టులు శిక్షలు విధించగా, ఆయన హైకోర్టులను ఆశ్రయించారు.

నటి అనితా చౌదరికి 4.14 లక్షల సైబర్ మోసం

ఈవార్తలు, వినోదవాణి: తక్కువ ధరకే విమాన టికెట్లు బుక్ చేస్తామంటూ సైబర్ కేటుగాళ్లు నటి గోగినేని అనితా చౌదరిని మోసగించారు. బిజినెస్ క్లాస్ టికెట్ పేరుతో ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.4,14,180 కాజేశారు. బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని కావూరి హిల్స్‌లో నివసిస్తున్న అనితా చౌదరి అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉన్న తన కుమారుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. నవంబర్ 12న విమాన టికెట్ల కోసం ఆన్‌లైన్‌లో ట్రావెల్ ఏజెన్సీలను వెతికారు. ఈ క్రమంలో 'లో ఫ్లై టూర్స్ అండ్ ట్రావెల్స్' పేరుతో రాజేశ్ అనే వ్యక్తి ఆమెను సంప్రదించాడు. తక్కువ ధరకే బిజినెస్ క్లాస్ టికెట్లు ఇప్పిస్తానని నమ్మించాడు. వాషింగ్టన్‌కు వెళ్లి రావడానికి టికెట్ ధర రూ.4,14,180 అవుతుందని చెప్పాడు. బుకింగ్ కోసం డెబిట్ కార్డు వివరాలు కావాలని కోరడంతో అనిత వాటిని అందించారు. అనంతరం టికెట్ ప్రాసెసింగ్ పేరుతో ఆమె ఫోన్‌కు వచ్చిన ఓటీపీలను కూడా తీసుకున్నాడు. ఓటీపీలు చెప్పిన వెంటనే క్లియర్‌ట్రిప్ ద్వారా ఆమె ఖాతా నుంచి రూ.4,14,180 డెబిట్ అయ్యాయి. అయితే టికెట్ కన్ఫర్మేషన్



విమర్శలే నాకు ప్రేరణ



ఈవార్తలు, వినోదవాణి: సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను ఇప్పుడు ప్రేరణగా తీసుకుంటున్నానని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. గతంలో నెగెటివ్ కామెంట్స్ తనను ఎంతో బాధపెట్టేవని, ఇప్పుడు వాటిని ఎదుర్కోవడం నేర్చుకున్నానని చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో విమర్శలు, కెరీర్‌లో తాను ఎంచుకునే పాత్రల గురించి మాట్లాడారు. మంచి సినిమాలు చేయడమే తన లక్ష్యమని, ఎంత కష్టపడినా విమర్శలు రావడం సహజమని దుల్కర్ పేర్కొన్నారు. అయితే వాటిని ఎప్పుడూ కక్షగా తీసుకోలేదని, తనను తాను నిరూపించుకునేందుకు ప్రేరణగా మార్చుకుంటున్నానని తెలిపారు. "కొన్ని పాత్రలు నేను చేయలేనని ఎవరైనా భావిస్తే, వాటిని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. కష్టమైన పాత్రలను ఎంచుకోవడం వల్లే నటుడిగా ఎదిగాను. ఇప్పుడు నాలో ఎవరిపైనా కసి, పగ లేవు" అని చెప్పారు. దుల్కర్ నటించిన 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20న విడుదల కానుంది. పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. అదే రోజు ఆయన తండ్రి మమ్ముట్టి నటించిన 'ఓఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదల కానుండటంతో బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాలు పోటీపడనున్నాయి.



తరుణ్‌కు ఈషా మంచి తోడు

ఈవార్తలు, వినోదవాణి: తన కుమారుడు తరుణ్ భాస్కర్ జీవితంలో నటి ఈషా రెబ్బా మంచి తోడుగా నిలిచిందని నటి గీతా భాస్కర్ అన్నారు. 'ఈఎన్ఈ రిపీట్' ప్రీ రిలీజ్ వేడుకలో ఆమె చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. గత రెండేళ్లుగా తరుణ్ భాస్కర్ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడని గీతా భాస్కర్ తెలిపారు. ఇల్లు కట్టుకోవడం, కోర్టు కేసులు, వ్యక్తిగత సమస్యలతో పాటు వృత్తిపరమైన ఒత్తిడిని ఎదుర్కొన్నాడని చెప్పారు. అర్ధరాత్రి, తెల్లవారుజామున ఇంటికి వచ్చినప్పుడు అతడిని చూసుకునేందుకు ఎవరూ ఉండేవారు కాదని గుర్తుచేసుకున్నారు. "నాకు వయసు పెరుగుతోంది. నా తర్వాత తరుణ్‌ను ఎవరు చూసుకుంటారనే ఆందోళన ఉండేది. అతడికి మంచి తోడు ఉంటే బాగుంటుందని అనుకునేదాన్ని. కష్టకాలంలో ఈషా అతడికి అండగా నిలిచింది. ఇప్పుడు నా కొడుకును చూసుకోవడానికి ఒకరున్నారనే ధైర్యం వచ్చింది" అని గీతా భాస్కర్ భావోద్వేగంతో చెప్పారు. తరుణ్, ఈషా మధ్య అనుబంధం గురించి గీతా భాస్కర్ మాట్లాడటంతో వీరిద్దరి రిలేషన్‌షిప్‌పై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. త్వరలో పెళ్లి చేసుకోనున్నారంటూ ప్రచారం జరుగుతున్నప్పటికీ, వివాహంపై అధికారిక ప్రకటన వెలువడలేదు.

గుర్నూర్ బ్రార్‌కు ఐసీసీ షాక్

అతిగా సంబరాలు చేసుకున్నందుకు డీమెరిట్ పాయింట్



ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన భారత యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. అతడిని మందలించడంతోపాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. మౌంట్ మౌంగనూయిలో జరిగిన మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్ టిమ్ సీఫెర్ట్‌ను ఔట్ చేసిన తర్వాత అతడి ముఖం వద్దకు వెళ్లి దూకుడుగా సంబరాలు చేసుకోవడమే ఇందుకు కారణం. 12వ ఓవర్‌లో ఈ ఘటన జరగగా, అక్కడే ఉన్న విరాట్ కోహ్లీ జోక్యం చేసుకుని గుర్నూర్‌ను శాంతింపజేశాడు. బ్యాటర్‌ను రెచ్చగొట్టేలా ప్రవర్తించడం ఐసీసీ లెవెల్-1 కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.5 ఉల్లంఘన కిందకు వస్తుందని మ్యాచ్ రిఫరీ నిర్ధారించాడు. గత 24 నెలల్లో గుర్నూర్‌కు ఇది రెండో తప్పు కావడంతో అతడి ఖాతాలో డీమెరిట్ పాయింట్లు రెండుకు చేరాయి. మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగల్లె విధించిన శిక్షను గుర్నూర్ అంగీకరించడంతో విచారణ అవసరం లేకుండా కేసు ముగిసింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 333 పరుగులు చేయగా, భారత్ 89 పరుగులకే ఆలౌటై 244 పరుగుల తేడాతో ఓడిపోయింది. విల్ యంగ్ 125 పరుగులు చేయగా, మ్యాట్ హెన్రీ ఆరు వికెట్లు పడగొట్టాడు.



ఐపీఎల్ రిటెన్షన్‌పై ఉత్కంఠ

జైస్వాల్ భవిష్యత్తుపై ఆసక్తి

ఈవార్తలు, క్రీడావాణి: ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించి ఆటగాళ్ల రిటెన్షన్ ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. పది ఫ్రాంచైజీలు తమ వద్ద కొనసాగించబోయే ఆటగాళ్ల జాబితాలను ప్రకటించేందుకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే రెండు కీలక ట్రేడింగ్‌లు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు మారగా, పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై జట్టులో చేరాడు. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు చేరాడు. ఈ డీల్‌లో భాగంగా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను ఢిల్లీ లక్నోకు బదిలీ చేసింది. 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్‌ను నిలబెట్టుకున్న తర్వాత ఫ్రాంచైజీల్లో ఆటగాళ్ల మార్పులపై చర్చ మొదలైంది. జైస్వాల్ రాజస్థాన్‌ను వీడే అవకాశముందన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. రిటెన్షన్ జాబితాల ప్రకటనతో ఈ అంశాలపై స్పష్టత రానుంది.

శాండ్‌పేపర్ వివాదంపై మళ్లీ దుమారం

అభిమానులకు సమాధానం చెప్పాల్సిందే: హేడెన్

ఈవార్తలు, క్రీడావాణి: ఆస్ట్రేలియా క్రికెట్‌ను 2018లో కుదిపేసిన శాండ్‌పేపర్ గేట్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ ఘటనపై కొత్త ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అభిమానులకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆసీస్ మాజీ క్రికెటర్ మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు. 2018లో దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడినందుకు అప్పటి కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా నిషేధం విధించింది. అయితే ఇటీవల ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సర్వైవర్'లో ఈ ఘటన గురించి కొత్త విషయాలు వెల్లడించాడు. శాండ్‌పేపర్ ఉపయోగించిన విషయం ముగ్గురికే కాకుండా జట్టులోని ఆటగాళ్లందరికీ తెలుసని పేర్కొన్నాడు. ఖవాజా వాదనకు వార్నర్ మద్దతు తెలపగా, ప్రస్తుత కెప్టెన్ పాట్ కమిన్స్ ఆ ఆరోపణలను తోసిపుచ్చాడు.





నలుగురు పేసర్లతోనే బరిలోకి

న్యూజిలాండ్‌తో తొలి టెస్టుపై గిల్ వ్యూహం

ఈవార్తలు, క్రీడావాణి: న్యూజిలాండ్‌తో జరగనున్న తొలి టెస్టులో నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. ఏడుగురు బ్యాటర్లు, నలుగురు పేసర్ల కూర్పుతో అడే అవకాశముందని తెలిపాడు. వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ వేదికగా గురువారం తొలి టెస్టు ప్రారంభం కానుంది. మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గిల్.. భారత పేసర్లు మంచి ఫామ్‌లో ఉన్నారని, నలుగురు ఫాస్ట్ బౌలర్లతో ఆడాలనే ఆలోచనలో ఉన్నామని చెప్పాడు. మూడో రోజు నుంచి పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారే అవకాశముందని, పాత బంతితోనూ ప్రభావం చూపగల పేసర్లు అవసరమని అభిప్రాయపడ్డాడు. జస్‌ప్రీత్ బుమ్రా పేస్ విభాగానికి నాయకత్వం వహించనుండగా, మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ తుది జట్టులో చోటు కోసం పోటీపడుతున్నారు. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఫిట్‌నెస్, ఫామ్‌పై వస్తున్న సందేహాలను గిల్ తోసిపుచ్చాడు. పంత్ అనుభవజ్ఞుడైన ఆటగాడని, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో సెంచరీలు సాధించాడని గుర్తుచేశాడు. ఇండియా-ఎ తరఫున సెంచరీ చేసిన ధ్రువ్ జురెల్ కూడా తుది జట్టులో చోటు కోసం పోటీపడుతున్నాడు. సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ కూడా మంచి ప్రదర్శనతో తమ అవకాశాలను మెరుగుపరుచుకున్నారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను దేశవాళీ క్రికెట్ ఆడేందుకు జట్టు నుంచి విడుదల చేశారు.

కొత్త బంతితోనే అసలు సవాల్



ఈవార్తలు, క్రీడావాణి: భారత్‌తో జరగనున్న తొలి టెస్టులో కొత్త బంతిని ఎదుర్కోవడం బ్యాటర్లకు పెద్ద సవాలుగా మారుతుందని న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర అభిప్రాయపడ్డాడు. వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ పిచ్ ఆరంభంలో ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉన్నా, మ్యాచ్ సాగేకొద్దీ బ్యాటింగ్‌కు సహకరిస్తుందని అంచనా వేశాడు. పిచ్‌పై పచ్చిక కనిపించినంత మాత్రాన బంతి ఎక్కువగా నీమ్ అవుతుందని, బౌన్స్ అవుతుందని భావించాల్సిన అవసరం లేదన్నాడు. ఇది సాధారణ టెస్టు వికెట్ అని పేర్కొన్నాడు. బేసిన్ రిజర్వ్‌లో మంచి బౌన్స్, క్యారీ ఉంటాయని, ముఖ్యంగా కొత్త బంతితో పేసర్లు ప్రభావం చూపే అవకాశముందని తెలిపాడు. అయితే క్రీజులో కుదురుకున్న బ్యాటర్లు భారీ స్కోర్లు చేయవచ్చన్నాడు. గత కొన్నేళ్లుగా ఈ మైదానంలో మంచి స్కోర్లు నమోదయ్యాయని గుర్తుచేశాడు. న్యూజిలాండ్ పిచ్‌లపై సాధారణంగా సీమర్ల ఆధిపత్యం ఉన్నప్పటికీ, స్పిన్నర్లకు కూడా కొంత సహకారం లభిస్తుందని వివరించాడు. భుజం గాయం నుంచి కోలుకొని జట్టులోకి తిరిగి రావడంపై రచిన్ ఆనందం వ్యక్తం చేశాడు. ఎనిమిది వారాల పాటు రిహాబిలిటేషన్‌లో ఉన్నానని, జట్టు మ్యాచ్‌లను టీవీలో చూడటం కష్టంగా అనిపించిందని చెప్పాడు. దాదాపు మూడు నెలల తర్వాత సొంత మైదానమైన వెల్లింగ్టన్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపాడు.



టెస్టు సిరీస్‌కు శాంట్నర్ దూరం

భారత్‌తో పోరుకు ముందు కివీస్‌కు ఎదురుదెబ్బ

ఈవార్తలు, క్రీడావాణి: భారత్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు న్యూజిలాండ్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు సీనియర్ ఆల్‌రౌండర్, వైట్ బాల్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అతడి కుడి చేతికి ఫ్రాక్చర్ అయినట్లు న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఆదివారం భారత్‌తో జరిగిన ఐదో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో శాంట్నర్ గాయపడ్డాడు. అనంతరం నిర్వహించిన స్కానింగ్‌లో ఫ్రాక్చర్ నిర్ధారణ కావడంతో టెస్టు సిరీస్ నుంచి తప్పించారు. శాంట్నర్ స్థానంలో సెంట్రల్ డిస్ట్రిక్ట్స్ స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్‌ను ఎంపిక చేశారు. టామ్ లాథమ్ నాయకత్వంలోని టెస్టు జట్టులో అతడు చేరనున్నాడు. ఈ ఏడాది మేలో ఐర్లాండ్‌పై ఫాక్స్‌క్రాఫ్ట్ టెస్టు అరంగేట్రం చేశాడు. శాంట్నర్ పూర్తిగా కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని న్యూజిలాండ్ బోర్డు తెలిపింది. భారత్‌తో సిరీస్ తర్వాత ఆస్ట్రేలియాతో జరిగే టెస్టులకు అతడు అందుబాటులో ఉంటాడా లేదా అనే విషయాన్ని తర్వాత వెల్లడిస్తామని పేర్కొంది. భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు గురువారం వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్‌లో ప్రారంభం కానుంది. రెండో టెస్టు నవంబర్ 27 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో జరుగుతుంది. ఇప్పటికే భారత్‌తో వన్డే సిరీస్‌లో పలువురు కీలక ఆటగాళ్లు గాయపడటంతో ఇబ్బందులు ఎదుర్కొన్న న్యూజిలాండ్, ఆ సిరీస్‌ను 1-3 తేడాతో కోల్పోయింది. ఇప్పుడు శాంట్నర్ కూడా దూరం కావడంతో టెస్టులకు ముందు జట్టు కష్టాలు మరింత పెరిగాయి.

ఆ 57 పరుగులే నా కెరీర్‌ను మార్చాయి

పాకిస్థాన్ పర్యటన జ్ఞాపకాలను పంచుకున్న సచిన్



ఈవార్తలు, క్రీడావాణి: పాకిస్థాన్ స్పిన్నర్ అబ్దుల్ ఖాదిర్ బౌలింగ్‌లో కొట్టిన సిక్సర్ల కంటే సియాల్‌కోట్ టెస్టులో చేసిన 57 పరుగులే తన కెరీర్‌ను మలుపుతిప్పాయని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వెల్లడించాడు. ముంబైలోని శరద్ పవార్ మ్యూజియంలో తన కెరీర్‌కు సంబంధించిన 25 బ్యాట్‌లతో ఏర్పాటు చేసిన 'బ్యాటోగ్రఫీ' విభాగాన్ని ప్రారంభించిన సందర్భంగా సచిన్ పలు జ్ఞాపకాలను పంచుకున్నాడు. 1989 పాకిస్థాన్ పర్యటనలో జరిగిన నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 34 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిందని గుర్తుచేశాడు. ఆ సమయంలో తాను 57 పరుగులు చేయడంతో మ్యాచ్‌ను డ్రా చేసుకోగలిగామని, సిరీస్‌ను కాపాడుకున్నామని చెప్పాడు. అయితే అభిమానులు ఆ ఇన్నింగ్స్ కంటే అబ్దుల్ ఖాదిర్ బౌలింగ్‌లో కొట్టిన సిక్సర్లనే ఎక్కువగా గుర్తుపెట్టుకున్నారని పేర్కొన్నాడు. అదే పర్యటనలో పెషావర్‌లో వర్షం కారణంగా రద్దయిన అంతర్జాతీయ మ్యాచ్ స్థానంలో నిర్వహించిన ఎగ్జిబిషన్ మ్యాచ్ గురించి కూడా సచిన్ మాట్లాడాడు. ముస్తాక్ అహ్మద్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు కొట్టిన తర్వాత అబ్దుల్ ఖాదిర్ తనకు సవాల్ విసిరాడని తెలిపాడు. ఆ మ్యాచ్‌లో 18 బంతుల్లో 53 పరుగులు చేశానని, తర్వాత ఖాదిర్ తనను అభినందించాడని చెప్పాడు. 1996 ప్రపంచకప్‌లో స్టిక్కర్ లేని బ్యాట్‌తో ఆడటం తనకు సెంటిమెంట్‌గా మారిందన్నాడు. ఆ బ్యాట్‌తో రెండు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలవడంతో ఓ విదేశీ బ్రాండ్ నుంచి వచ్చిన స్పాన్సర్‌షిప్ ఆఫర్‌ను తిరస్కరించినట్లు వెల్లడించాడు. మొహాలీలో సునీల్ జోషి కోసం తయారు చేసిన బ్యాట్ తనకు బాగా నచ్చడంతో రెండు కొత్త బ్యాట్‌లు ఇస్తానని చెప్పి దానిని తీసుకున్నట్లు సచిన్ గుర్తుచేశాడు. హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌కు ముందు ఆ బ్యాట్‌ను తెప్పించుకొని ప్రాక్టీస్ చేయకుండానే ఉపయోగించానని తెలిపాడు. తన అక్క సవిత కశ్మీర్ నుంచి తెచ్చిన బ్యాటే తన మొదటి బ్యాట్ అని చెప్పాడు.

సన్‌రైజర్స్‌కు ట్రావిస్ హెడ్ షాక్

ఐపీఎల్ 2027 సీజన్‌కు దూరం

ఈవార్తలు, క్రీడావాణి: ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ వచ్చే సీజన్‌కు అందుబాటులో ఉండబోనని జట్టు యాజమాన్యానికి తెలియజేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో పెరుగుతున్న పనిభారాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నాడు. హెడ్ తప్పుకోవడంతో అభిషేక్ శర్మతో అతడి ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని సన్‌రైజర్స్ కోల్పోనుంది. అయితే 2025 మెగా వేలానికి ముందు హెడ్‌ను రిటైన్ చేసుకునేందుకు కేటాయించిన రూ. 14 కోట్లు తిరిగి జట్టు వేలం పర్స్‌లో చేరనున్నాయి. ఆస్ట్రేలియా జట్టుకు వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్, యాషెస్ సిరీస్, 2027 వన్డే ప్రపంచకప్ వంటి కీలక టోర్నీలు ఉండటంతో పనిభారాన్ని తగ్గించుకోవాలని హెడ్ భావిస్తున్నాడు. 2024లో రూ. 6.8 కోట్లకు సన్‌రైజర్స్‌లో చేరిన హెడ్, ఆ సీజన్‌లో 567 పరుగులు చేశాడు. హైదరాబాద్ ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. 2025లో 374 పరుగులు, 2026లో 410 పరుగులు సాధించాడు. మరోవైపు హైదరాబాద్ ఫ్రాంచైజీ ట్రేడింగ్‌లో చురుగ్గా వ్యవహరిస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి టి.నటరాజన్‌ను తిరిగి తీసుకొని జీషన్ అన్సారీని విడుదల చేసింది. చెన్నైతో జరిగిన డీల్‌లో ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్‌లను తీసుకొని లియామ్ లివింగ్‌స్టోన్, జాక్ ఎడ్వర్డ్స్‌లను ఇచ్చింది.



నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

కల్లాల్లో ధాన్యం.. కాగితాల్లో కొనుగోళ్లు!

రైతు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తాడు. విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు ప్రకృతితో పోరాడతాడు. వర్షాలు పడకపోతే ఆందోళన, అధికంగా పడితే ఆవేదన. ఎరువుల ధరలు, కూలీల ఖర్చులు, సాగునీటి సమస్యలు, అప్పుల భారం అన్నింటినీ ఎదుర్కొని చివరకు ధాన్యాన్ని కల్లానికి చేరుస్తాడు. ఆ సమయంలోనైనా ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆశిస్తాడు. కానీ పంట అమ్ముకునేందుకు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తే ఆ కష్టం మరింత పెరుగుతుంది. తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లపై తాజాగా వెలువడుతున్న ఫిర్యాదులు ఇదే సమస్యను మరోసారి తెరపైకి తెచ్చాయి. రైతుకు అవసరమైన సమయంలో కొనుగోలు కేంద్రం పనిచేయకపోతే, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఎంత ఉన్నా ప్రయోజనం ఉండదు. నవంబర్ 18న వెలువడిన వార్తా కథనం ప్రకారం, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో పర్యటించిన మాజీ మంత్రి హరీశ్‌రావు ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం ఉందని ఆరోపించారు. నిజాంపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు తన దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన చెప్పారు. సన్నరకం ధాన్యానికి ప్రకటించిన బోనస్ అందడం లేదని, సాధారణ ధాన్యం కొనుగోళ్లలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. కొన్ని కేంద్రాల్లో క్వింటాలుకు పది కిలోల వరకు కోత విధిస్తున్నారన్న ఆరోపణ కూడా చేశారు. ఇవి ప్రతిపక్ష నేత చేసిన ఆరోపణలు, రైతులు వెల్లడించిన ఫిర్యాదులు మాత్రమే. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉందని స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. అయినప్పటికీ ప్రభుత్వం వీటిపై క్షేత్రస్థాయి విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో భారీ స్థాయిలో ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక ప్రకటించింది. సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ, 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించింది. కొనుగోళ్ల విలువను రూ.18,250 కోట్లుగా అంచనా వేసింది. అక్టోబర్ 15 నుంచి కొనుగోళ్లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,441, గ్రేడ్-ఏ రకానికి రూ.2,461 చెల్లించాల్సి ఉంది. ఎంపిక చేసిన సన్నరకాలకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇవన్నీ రైతులకు భరోసా కల్పించే నిర్ణయాలే. అయితే ప్రకటించిన లక్ష్యాలు, క్షేత్రస్థాయిలో జరిగిన కొనుగోళ్లు ఒకేలా ఉన్నాయా అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

ఓయూలో మార్పులకు కొత్త దిశ

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉంది. విద్యార్థి ఉద్యమాలకు, రాజకీయ చర్చలకు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ కాలేజీ ఎప్పుడూ కేంద్రంగా నిలుస్తోంది. అలాంటి చారిత్రక నేపథ్యం ఉన్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్‌కు ఆచార్య సి.కాశీం, 14 నవంబర్ 2024న ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన నాయకత్వంలో కాలేజీ నిర్వహణలో విద్యార్థుల భాగస్వామ్యం, క్రమశిక్షణ, పరిశుభ్రత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, అకడమిక్ కార్యకలాపాలకు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం నుంచి స్టూడెంట్ క్లబ్బుల ఏర్పాటు వరకు, తరగతి గది విద్య నుంచి పరిశోధన, సృజనాత్మక కార్యక్రమాల వరకు, కాలేజీ అభివృద్ధి నుంచి యూనివర్సిటీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వరకు అనేక అంశాలకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రెండేళ్ల ప్రయాణాన్ని పరిశీలిస్తే కొన్ని మార్పులు, ప్రయోగాలు, సవాళ్లు, అనుభవాలు స్పష్టంగా కనిపిస్తాయి.



రామకృష్ణ గోగులమూడి
పొలిటికల్ సైన్స్, ఓయూ

ప్రొఫెసర్ కాశీం నాయకత్వంలో ఆర్ట్స్ కాలేజీలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు వివిధ స్టూడెంట్ క్లబ్బులను ఏర్పాటు చేశారు. లిటరేచర్ క్లబ్, డిబేట్ క్లబ్, కల్చరల్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్ వంటి వేదికల ద్వారా విద్యార్థులు తమ ఆసక్తులు, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశాలు కల్పించారు. ఆర్ట్స్ కాలేజ్ మెట్ల పైన కాలేజీ గార్డెన్లో సాయంత్రం సమయంలో చర్చ వేదికలు కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా సాహిత్యం, చర్చలు, కళలు, క్రీడలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించారు. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల మధ్య పరిచయాలు, ఐక్యత, సమన్వయం పెంపొందించడానికి ఈ క్లబ్బులు ఉపయోగపడ్డాయి. ఆర్ట్స్ కాలేజీ అంటే కేవలం పాఠాలు, పరీక్షలు మాత్రమే కాదు.. సాహిత్యం, సంస్కృతి, కళలు, సామాజిక చైతన్యానికి కూడా వేదిక కావాలనే దృక్పథంతో కార్యక్రమాలను ప్రోత్సహించారు. "తెలుగు లిటరరీ కాంగ్రెస్" (తెలుగు సాహిత్య మహా సభలు) నిర్వహించి కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ ప్రేమికులను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. వరుసగా రెండుసార్లు సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆర్ట్స్ కాలేజీలో సాహిత్య వాతావరణాన్ని మరింత బలోపేతం చేశారు. అలాగే ఓజాస్ కార్యక్రమాన్ని కూడా ఘనంగా నిర్వహించి విద్యార్థుల్లోని సృజనాత్మకత, కళాత్మక ప్రతిభను వెలికితీసేందుకు వేదిక కల్పించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఆర్ట్స్ కాలేజీని విద్యతో పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాలకు కూడా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు దీటుగా ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు కార్యక్రమాలను నిర్వహించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఈ ప్రయత్నాలు సాగాయి. విద్యార్థులకు బాధ్యతలు అప్పగించడం, వారి ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వారిలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రయత్నించారు. ఆర్ట్స్ కాలేజీకి రాష్ట్ర స్థాయిని దాటి దేశస్థాయిలోనూ గుర్తింపు తీసుకురావాలనే దిశగా ఈ కార్యక్రమాలు దోహదపడ్డాయి.

అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధనలకు ప్రాధాన్యం

సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అకడమిక్ కార్యకలాపాలపైనా ప్రత్యేక దృష్టి పెట్టారు. విద్యార్థులకు ఉపయోగపడే విద్యా సంబంధిత కార్యక్రమాలు, చర్చలు, సదస్సులు, ఇతర అకడమిక్ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థుల్లో పుస్తక పఠనం, విషయ పరిజ్ఞానం, చర్చించే సామర్థ్యం, ప్రశ్నించే తత్వం పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలను ప్రోత్సహించారు. అదేవిధంగా ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో విద్యార్థులు ముందుకు వెళ్లేందుకు అవసరమైన విద్యా వాతావరణాన్ని ప్రోత్సహించడం కూడా ముఖ్యమైన అంశంగా నిలిచింది. పరిశోధన పట్ల ఆసక్తి, విశ్లేషణాత్మక ఆలోచన, కొత్త విషయాలను అన్వేషించే తత్వం విద్యార్థుల్లో పెంపొందించే దిశగా అకడమిక్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విశ్వవిద్యాలయ విద్య అనేది కేవలం డిగ్రీ పొందడంతో ముగిసిపోకూడదు. విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు పోటీ పరీక్షల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే దిశగా కూడా సిద్ధం కావాలి. ఈ లక్ష్యానికి అనుగుణంగా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, విషయ పరిజ్ఞానం, చర్చించే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే వాతావరణానికి ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అకడమిక్ అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలపై అవగాహన, పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే సామర్థ్యం పెంపొందించడం కూడా విద్యాసంస్థ బాధ్యత అనే దృక్పథం ఈ ప్రయత్నాల్లో కనిపిస్తుంది.

కాలేజీ అభివృద్ధి.. ఆర్థిక నిర్వహణ, నిర్మాణ పనులపై దృష్టి

ఆర్ట్స్ కాలేజీ అభివృద్ధిలో మౌలిక సదుపాయాలు, నిర్మాణ పనులు, ఆర్థిక నిర్వహణ కూడా కీలకమైన అంశాలు. ఈ విషయాల్లో కేవలం బయటి ఆర్థిక సహాయంపైనే ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నాలు చేశారు. వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరంతో సమన్వయం చేసుకుంటూ కాలేజీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ముందుకు తీసుకెళ్లారు. ఆర్థిక అంశాలను క్రమబద్ధీకరించడం, నిర్మాణ పనులకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడం వంటి విషయాలపై దృష్టి సారించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగిస్తూ, ఆర్థిక అంశాలను క్రమబద్ధీకరిస్తూ ఆర్ట్స్ కాలేజీని ముందుకు నడిపించేందుకు చేసిన ప్రయత్నాలు ఈ రెండేళ్ల ప్రయాణంలో ప్రస్తావించదగినవి. ఒక విద్యాసంస్థకు క్రమశిక్షణ ఎంత ముఖ్యమో, పరిశుభ్రమైన వాతావరణం కూడా అంతే ముఖ్యం. ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో క్రమశిక్షణను పెంపొందించడం, పరిశుభ్రతను కాపాడడం, విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఒకప్పుడు ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణం వివిధ బ్యానర్లు, పోస్టర్లతో నిండిపోయేది. ఈ పరిస్థితిని మార్చేందుకు అనవసరమైన బ్యానర్లు, పోస్టర్లను తొలగించి, ప్రాంగణంలో కార్యక్రమాల నిర్వహణను క్రమబద్ధీకరించారు. కాలేజీ ప్రాంగణానికి ప్రత్యేకమైన విద్యా వాతావరణం, సంస్థాగత గౌరవం ఉండాలనే దిశగా చర్యలు తీసుకున్నారు.

7. 75 శాతం హాజరు.. చర్చకు దారితీసిన నిర్ణయం

ఆయన తీసుకున్న నిర్ణయాల్లో 75 శాతం హాజరు నిబంధన ఒకటి. ఈ నిర్ణయంపై కొంతమంది విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇది తన వ్యక్తిగత నిర్ణయం కాదని, అన్ని విభాగాధిపతులతో చర్చించి తీసుకున్న సమష్టి నిర్ణయమని ఆయన వివరించారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. యూనివర్సిటీ అనేది కేవలం డిగ్రీలు ఇచ్చే కేంద్రం కాదని, విద్యార్థుల మేధో వికాసానికి, ఆలోచనా పరిణతికి, చర్చలకు, ప్రశ్నించే తత్వానికి కేంద్రంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు తరగతులకు వచ్చి బోధిస్తున్నప్పుడు విద్యార్థులు కూడా తరగతులకు హాజరై ఆ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆర్ట్స్ కాలేజీకి విద్యార్థి ఉద్యమాల చరిత్ర ఉంది. అలాంటి వాతావరణంలో విద్యార్థి సంఘాలను, విద్యార్థి ప్రతినిధులను కలుపుకొని ముందుకు సాగడం కీలకం. వివిధ విద్యార్థి సంఘాలతో చర్చలు, సమన్వయం కొనసాగిస్తూ కాలేజీ కార్యకలాపాల్లో వారి భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు ఏదైనా సమస్య ఎదురైతే ప్రిన్సిపల్‌గా ఆయన స్వయంగా స్పందించి పరిష్కారానికి ప్రయత్నించేవారని విద్యార్థులు పేర్కొంటున్నారు. విద్యార్థుల సమస్యల్లో న్యాయం ఉందని భావించినప్పుడు వారికి అండగా నిలబడేందుకు ప్రయత్నించారు. విద్యార్థి సంఘాల అభిప్రాయాలను వినడం, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనడం వంటి అంశాలు పరిపాలనలో భాగస్వామ్య దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి.

సీఎంతో చర్చ.. ఓయూ అభివృద్ధికి రూ.1,000 కోట్ల నిధులు

ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించారు. వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని యూనివర్సిటీకి ఆహ్వానించడంలో ఆయన భాగస్వాములయ్యారు. 2025 ఆగస్టు 25న ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన ముఖ్యమంత్రి, యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అనంతరం 2025 డిసెంబర్ 10న మరోసారి యూనివర్సిటీకి ఆ నిధులకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రతిని విడుదల చేశారు. ఈ నిధులు యూనివర్సిటీ మౌలిక సదుపాయాలు, పరిశోధన, విద్యా వసతుల అభివృద్ధికి ఉపయోగపడనున్నాయి. యూనివర్సిటీకి ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంలో ప్రొఫెసర్ సి. కాశీం గారు ఉస్మానియా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఉస్మానియా యూనివర్సిటీ పౌరుడిగా, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా యూనివర్సిటీ సమస్యలపై ముఖ్యమంత్రిని ప్రశ్నించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. విద్యకు సంబంధించిన అంశాలపై ఆయన చేసిన కొన్ని చమత్కార వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు, ట్రోలింగ్‌కు దారితీశాయి. అయితే వాటిని చమత్కారంగానే చేసిన వ్యాఖ్యలుగా ఆయన వివరించారు. విమర్శలు, ప్రశంసలు రెండింటినీ ఎదుర్కొంటూనే యూనివర్సిటీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ఆయన నాయకత్వంలోని మరో ముఖ్యమైన అంశంగా నిలిచింది. తెలుగు సాహిత్యంలో ఎన్నో నాటకాలు చదివిన ఆయనకు పుస్తకాల్లోని పాత్రలు, సంఘర్షణలు, కుట్రలు, ఎత్తుగడలు కొత్తేమీ కాదు. కానీ నిజ జీవితంలోనూ ఇలాంటి రాజకీయాలు, అంతర్గత విరోధాలు ఎదురవుతాయని బహుశా ఊహించి ఉండకపోవచ్చు. మార్క్సిస్టు దృక్పథంలో వర్గ వైరుధ్యాలను విశ్లేషించిన ఆయన, సంస్థాగత వైరుధ్యాల దగ్గర మాత్రం కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నారేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఆయనది ముక్కుసూటి మనస్తత్వం. రాజకీయ ఎత్తుగడల కంటే సూటిగా మాట్లాడటానికే ప్రాధాన్యం ఇచ్చే వ్యక్తిత్వం.

ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి వైదొలిగే సమయంలో ప్రొఫెసర్ సి. కాశీం చేసిన ప్రసంగం సాధారణ ధన్యవాదాల ప్రసంగంలా కాకుండా, విశ్వవిద్యాలయ వ్యవస్థపై తనకున్న అవగాహనను, అనుభవాలను, ఆలోచనలను వ్యక్తం చేసిన ప్రసంగంగా కనిపించింది. వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మరోసారి ప్రిన్సిపాల్‌గా కొనసాగాలని కోరినప్పటికీ, మరొకరికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆ ప్రతిపాదనను సున్నితంగా పక్కన పెట్టినట్లు ఆయన మాటల్లో అర్థమైంది. బాధ్యతలు ఒకరి దగ్గరే నిరంతరం ఉండకూడదని, కొత్తవారికి కూడా అవకాశాలు రావాలని ఆయన భావనలో కనిపించింది. గతంలో అప్పటి వీసీ రవీందర్ గారి కాలంలో ఒక ప్రొఫెసర్ సస్పెన్షన్‌కు గురైన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, ఆ సస్పెన్షన్‌ను తొలగించేందుకు వ్యక్తిగతంగా కాకుండా సమిష్టిగా పోరాడాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. ఇది సహోద్యోగుల పట్ల ఆయనకున్న బాధ్యతను, ఐక్యతా భావాన్ని తెలియజేస్తుంది. ఆర్ట్స్ కాలేజీలో తనకు సహకరించిన అనేకమంది ప్రొఫెసర్లను గుర్తుచేసుకుంటూ, ఒక విశ్వవిద్యాలయం అంటే కేవలం భవనాలు, తరగతి గదులు, కుర్చీలు మాత్రమే కాదని, బోధన, పరిశోధన, మేధో వికాసం ద్వారా వ్యక్తులను, ఆలోచనలను తయారుచేసే వ్యవస్థ అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్ట్స్ కాలేజీని ఒక వ్యవసాయ క్షేత్రంతో పోల్చిన ఆయన, అక్కడ అనేక మార్పులు చేపట్టి, కలుపు మొక్కలను తొలగించినట్లుగా సంస్థాగత సమస్యలను సరిదిద్దేందుకు ప్రయత్నించిన విషయాన్ని తనదైన రూపకంతో వ్యక్తం చేశారు. అందరూ ఒకే విధంగా ఆలోచించలేరు. కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు సహజం. వాటిని వ్యక్తిగత విరోధాలుగా కాకుండా, సరిదిద్దుకోవాల్సిన అంశాలుగా భావించి ముందుకు సాగాలని ఆయన సూచించారు. 2026 నవంబర్ 17న ప్రొఫెసర్ సి. కాశీం గారికి ఆర్ట్స్ కాలేజీలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని, ఆయన నాయకత్వంలో సాగిన ప్రయాణంలోని అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఒక బాధ్యత నుంచి మరో బాధ్యతకు మారే సందర్భంలో ఇలాంటి వీడ్కోలు సభలు వ్యక్తిగత అనుబంధాలను మాత్రమే కాకుండా, ఒక విద్యాసంస్థలో సాగిన ప్రయాణాన్ని కూడా గుర్తుచేస్తాయి. ఈ రెండేళ్ల కాలంలో ఆయన చేపట్టిన ప్రతి ప్రయత్నం అందరికీ ఒకేలా నచ్చి ఉండకపోవచ్చు. కొన్ని నిర్ణయాలు చర్చకు దారితీసి ఉండవచ్చు. మరికొన్ని మార్పులు ప్రశంసలు పొందివుండవచ్చు. అయినప్పటికీ, ఒక విద్యాసంస్థలో మార్పు తీసుకురావాలనే ప్రయత్నం అనేది ఎప్పుడూ సవాళ్లతో కూడుకున్నదే. ఆర్ట్స్ కాలేజీ వంటి చారిత్రక నేపథ్యం ఉన్న సంస్థలో మార్పులు చేపట్టడం మరింత బాధ్యతతో కూడిన పని. ప్రొఫెసర్ సి. కాశీం తదుపరి సాహిత్య, విద్యా, సామాజిక ప్రయాణం మరింత అర్థవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ.. ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు.



రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.